నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 30-10-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 66 పేజీలు:6 వెల: రూ.1/-

ఈశాన్య రుతుపవనాల ఆగమనం.. ఐదు రోజులు అక్కడ భారీ వర్షాలు..!

న్యూఢిల్లీ, అక్టోబర్ 29: ఈశాన్య రుతుపవనాలు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌ను పలకరించాయి. నైరుతి రుతుపవనాలు దేశాన్ని వీడగా.. ఈశాన్య రుతుపవనాల ఆగమనం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తుండగా తమిళనాడులో ప్రవేశించినట్లు భారత వాతావరణ శాఖ తెలిపింది. రాబోయే 24 గంటల్లో ఈశాన్య రుతుపవనాల వర్షాలు దేశంలోని ఆగ్నేయ ప్రాంతాల్లో ప్రారంభమవుతాయని పేర్కొంది. బంగాళాఖాతం, దక్షిణ ద్వీపకల్పం మీదుగా ఈశాన్య గాలులు, రుతుపవనాల ప్రభావంతో ఆయా ప్రాంతాల్లో వర్షాలు మొదలైనట్లు చెప్పింది. ఈ నెల 29 నుంచి నవంబర్ 2వ తేదీ వరకు తమిళనాడు వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో తేలికపాటి నుంచి మోస్తరు, పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది.

ఈ మేరకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున సోమవారం, మంగళవారాల్లో తిరువళ్లూరు, కాంచీపురం, రాణిపేట జిల్లాల్లో చెన్నై వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. కారైకల్, పుదుచ్చేరిలో విస్తృతంగా మోస్తరు వర్షాలు, ఉరుములు మరియు మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

ప్రజలకు దొంగ ఎవరో.. దొర ఎవరో అర్థమైంది : మంత్రి కేటీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 29:ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంపై దర్యాప్తు సంస్థలు తమ పని తాము చేస్తుంటాయని మంత్రి కేటీఆర్ అన్నారు. శనివారం మంత్రి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంపై స్పందించారు.

"ప్రజలకు దొంగ ఎవరో.. దొర ఎవరో అర్థమైంది. దేశంలో అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ మనది. ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంపై దర్యాప్తు సంస్థలు తమ పని తాము చేస్తుంటాయి. ఇప్పుడు మేం ఏం మాట్లాడినా వక్రీకరిస్తారు. పరిశోధన చేస్తున్న సంస్థలు సమాచారం ఇస్తాయి. మేం బాధ్యత గల వ్యక్తులం.

చట్టం కచ్చితంగా తన పని తాను చేస్తుంది. సందర్భానుసారంగా సీఎం, దర్యాప్తు సంస్థలు వివరాలు వెల్లడిస్తాయి. దర్యాప్తు సంస్థలను ప్రభావితం చేసేలా మాట్లాడము. తొందర పడవద్దని మా పార్టీ నాయకత్వానికి చెప్పా. సమయానుసారం సీఎం అన్ని విషయాలు మాట్లాడతారు. ప్రమాణాలతో సమస్యలు పరిష్కారమైతే ఇంక పోలీసులు ఎందుకు" అని మంత్రి అన్నారు.

ఈ సందర్భంగా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై మంత్రి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎనిమిదేళ్లలో కేంద్రం తెలంగాణకు చేసింది సున్నా అన్నారు. ఈ సందర్భంగా బీజేపీ, మోడీ సర్కార్‌పై పలు ఛార్జ్ షీట్‌లు దాఖలు చేస్తున్నట్లు చెప్పారు.

ఢిల్లీలో దారుణంగా వాయు నాణ్యత.. శ్వాస తీసుకోవడానికి ఇబ్బందిపడుతున్న ప్రజలు

న్యూఢిల్లీ, అక్టోబర్ 29: దేశ రాజధాని ఢిల్లీలో గాలి నాణ్యత రోజురోజుకు పడిపోతున్నది. దీపావళి సందర్భంగా ప్రభుత్వం పటాకులపై నిషేధం విధించింది. అయినప్పటికీ ప్రజలు లెక్కచేయకుండా పెద్దమొత్తంలో బాంబులను కాల్చడంతో వాయుకాలుష్యం తీవ్ర స్థాయికి చేరుకుంది. దీంతో వాయు నాణ్యత దారుణంగా పడిపోతున్నది. శనివారం ఉదయం ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 309గా నమోదైంది. నగరంలో మథురా రోడ్డు, బారఖాంబా రోడ్డు, ప్రగతి మైదాన్ వద్ద కాలుష్యం అత్యంత తీవ్రంగా ఉన్నది.

కాలుష్యం పెరిగిపోవడంతో కొన్నిసార్లు ఊపిరి పీల్చుకోవడం కూడా కష్టంగా ఉంటుందని సుఖ్‌దేవ్ అనే రిక్షా కార్మికుడు తెలిపారు. గాలిలో మార్పును మన కళ్లలో కూడా చూడవచ్చని చెప్పారు. అయినా ఇంట్లోనుంచి బయటికి వెళ్లక తప్పదన్నారు.

గాలి నాణ్యత సున్నా నుంచి 50 మధ్య ఉంటే బాగా ఉన్నట్టు అర్థం. 51 నుంచి 100 వరకు ఉంటే సంతృప్తికరమైనదని, 101 నుంచి 200 వరకు ఉంటే మితమైన నాణ్యత, 201 నుంచి 300 ఉంటే తక్కువ నాణ్యత అని, 301 నుంచి 400 వరకు ఉంటే చాలా పేలవమైనదని, 401 నుంచి 500 ఉంటే ప్రమాదకరస్థాయిగా పరిగణిస్తారు.

ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా పి. విజయబాబు.. రెండేళ్ల పాటు బాధ్యతలు

హైదరాబాద్, అక్టోబర్ 29:ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం నూతన అధ్యక్షుడిగా పి. విజయబాబు నియమితులయ్యారు. ఈ పదవిలో ఆయన రెండేళ్ల పాటు కొనసాగనున్నారు. సీనియర్ జర్నలిస్టు అయిన విజయబాబు గతంలో సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కమిషనర్ గా కూడా పనిచేశారు. ఈ మధ్య నెలకొన్న కొన్ని పరిణామాల నేపథ్యంలో అధికార భాషా సంఘం అధ్యక్ష పదవికి యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ రాజీనామా చేశారు.

అయితే.. యార్లగడ్డ రాజీనామాను ఆమోదించిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విజయబాబుకు రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్ష పదవీబాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు ఇవ్వాల (శుక్రవారం) అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల ఏపీ ప్రభుత్వం విజయవాడలోని వైద్య విశ్వవిద్యాలయానికి ఎన్టీఆర్ పేరు తొలగించి, వైఎస్సార్ పేరుపెట్టడం తెలిసిందే. ఈ పరిణామంతో మనస్తాపం చెందిన యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అధికార భాషా సంఘం అధ్యక్ష పదవి నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించారు.

దుమ్మురేపుతున్న కబడ్డీ కూత...!

- హోరాహోరీగా సాగుతున్న మ్యాచులు
- కూతతో ఒకరు... తొడగొడుతూ మరొకరు...
- సెమీస్ దశకు చేరుకున్న పోటీలు
- పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ అతిథ్యం పై ప్రశంసలు
- కామెంట్రీతో అదరగొడుతున్న బ్రహ్మన్న

ఖమ్మం, అక్టోబర్ 29 (నేటినిజం ప్రతినిధి) :కబడ్డీ కూత దుమ్మురేపుతుంది... నువ్వా నేనా సై అంటూ క్రీడాజట్లు తమ సత్తా చాటుతున్నాయి. ప్రతీ మ్యాచ్ ప్రారంభం నుంచి ముగిసే వరకు ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. కబడ్డీని చూసేందుకు వీక్షకులు ఆసక్తి చూపుతున్నారు. డే అండ్ నైట్ కొనసాగుతున్న పోటీలు పురుషులు, మహిళల విభాగంలో సెమీస్ దశకు చేరుకున్నాయి.

– కూతతో ఒకరు... తొడగొడుతూ మరొకరు...

పోటీలు ఆద్యంతం రసవత్తరంగా సాగుతున్నాయి. ఆయా జట్లలోని క్రీడాకారులు తమ ఆట తీరుతో వ్యక్తిగత నైపుణ్యాన్ని కనబరుస్తు శెహాభాష్ అనిపించుకుంటున్నారు. కూతతో ఒక జట్టు క్రీడాకారుడు సవాల్ విసురుతూంటే... ప్రత్యర్థి జట్టులోని మరొక క్రీడాకారుడు తొడగొడతూ ఆ సవాలకు ప్రతి సవాల్ విసురుతున్నాడు. ఇలా ప్రతీ జట్లలోని క్రీడాకారులు తమ జట్టు గెలుపుకోసం పోరాడుతున్నారు.

– సెమీస్ దశకు పోటీలు...

పూల్ 'ఏ', పూల్ 'బీ' ల వారీగా పురుషులు, మహిళల విభాగాల్లో సాగుతున్న పోటీలు సెమీస్ దశకు చేరుకున్నాయి. పురుషుల లీగ్ మ్యాచ్ లు 20, మహిళల లీగ్ మ్యాచ్ లు 20ని నిర్వాహకులు రెండోరోజైన శనివారం విజయవంతంగా పూర్తిచేశారు. ఈ టోర్నమెంట్ లో 58మంది జాతీయ, అంతర్జాతీయ అనుభవం కలిగిన రిఫరీలు హాజరై ఎలాంటి విమర్శలకు తావులేకుండా పోటీలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు.

– పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ అతిథ్యం పై ప్రశంసలు...

పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాష్ట్రస్థాయి కబడ్డీ ఛాంపియన్ షిప్స్ ట్రోఫీకి ప్రయోజకులుగా వ్యవహరిస్తున్న పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ అతిథ్యంపై ప్రశంసల జల్లు కురుస్తుంది. పోటీలకు హాజరైన పురుషులు, మహిళా క్రీడాకారులకు వేరువేరుగా కల్పించిన వసతి బాగుందంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వీరితో పాటు రిఫరీలకు కల్పిస్తున్న సౌకర్యాలపై కూడా సంతృప్తి వ్యక్తమవుతుంది.

– పసందైన వంటకాంబు...

పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులు, రిఫరీలకు, అతిథులకు ఏర్పాటు చేసిన వంటకాలు కూడా నోరూరించేలా ఉన్నాయి. ఉదయం వేళ ఇడ్లీ, వడ, దోశ, బొండా లాంటి టిఫిన్లతో పాటు మధ్యాహ్నం, రాత్రి వేళల్లో వెజ్, నాన్ వెజ్ తో పలురకాలైన వెరైటీ వంటకాలను నిర్వాహకులు హాజరైన వారికి రుచి చూపిస్తున్నారు.

– బ్రహ్మన్న కామెంట్రీ అదుర్స్...!

తుళ్లూరి బ్రహ్మయ్య అలియాస్ బ్రహ్మన్న పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వహక బాధ్యుల్లో ఒకరు.... ఒకవైపు పోటీల విజయవంతానికి కృషిచేస్తూనే మరోవైపు తన కామెంట్రీతో పోటీలను రక్తి కట్టిస్తున్నారు. మ్యాచులు జరుగుతున్న సమయంలో తన అద్భుతమైన వాక్ చాతుర్యంతో ఆకట్టుకుంటున్నారు. మ్యాచ్ ఆరంభం నుంచి పూర్తయ్యే వరకు ఎప్పటికప్పుడు తాజా స్కోర్లతో పాటు నవ్వులు పూయించే హాస్యాలను వెదజల్లుతున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే కబడ్డీ మ్యాచ్ లే కాదు బ్రహ్మన్న కామెంట్రీ కూడా వీక్షకులను కనువిందు చేస్తుంది.

– పోటీల సజావుకు ముఖ్య బాధ్యులు వీరే...

సజావుగా సాగుతున్న ఈ పోటీల నిర్వహణకు పీఎస్ఆర్ ట్రస్ట్ బాధ్యులతో పాటు పీఎస్ఆర్ యూత్ బాధ్యులే కీలకం. ప్రధానంగా పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇంఛార్జీ తుంబూరు దయాకర్ రెడ్డి, ట్రస్ట్ బాధ్యులు మువ్వా విజయబాబు, తుళ్లూరి బ్రహ్మయ్య, బొర్రా రాజశేఖర్, మద్దినేని బేబి స్వర్ణకుమారిలతో పాటు ఇంకా అనేక మంది పొంగులేటి అనుచరులు, అభిమానులు పోటీల విజయవంతానికి అహర్నిశలు కృషి చేస్తున్నారు. క్రీడాకారులకు, అతిథులకు, వీక్షకులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా కావాల్సిన అన్ని ఏర్పాట్లును చేస్తు పొంగులేటి పై తమకున్న అభిమానాన్ని చాటుకుంటున్నారు.

డిసెంబరు 31 కల్లా శ్రీనివాస సేతు నిర్మాణం పూర్తి : ఈవో ధర్మారెడ్డి

తిరుపతి, అక్టోబర్ 29: శ్రీనివాస సేతు నిర్మాణం పెండింగ్ పనులన్నింటినీ డిసెంబరు 31 లోగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని టీటీడీ ముఖ్యకార్య నిర్వహణాధికారి ఏవీ ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ వంతెన పనులు వీలైనంత త్వరగా పూర్తిచేసినట్లయితే తిరుపతిలో ట్రాఫిక్ సమస్యను పూర్తిగా పరిష్కరించవచ్చునన్నారు. తిరుపతిలోని టిటిడి పరిపాలన భవనంలోని కార్యాలయంలో సాయంత్రం ఆయన మున్సిపల్, స్మార్ట్ సిటి కార్పొరేషన్, టీటీడీ అధికారులతో సమీక్ష నిర్వహించారు.

రామానుజ సర్కిల్‌లో ఏర్పాటు చేయాల్సిన ఫ్యాబ్రికేటెడ్ గడ్డర్ త్వరగా తెప్పించి పనులు వేగవంతం చేయాలని ఆయన సూచించారు. ఈలోపు రోడ్లు, కాలువలు, ఫుట్‌పాత్, మీడియన్ల పనులు చేపట్టాలని చెప్పారు. రామానుజ సర్కిల్ నుంచి మామిడికాయల మండీ, కళాంజలి షోరూం, ఆర్‌టీసీ బస్టాండు, సుబ్బలక్ష్మి విగ్రహం నుంచి ఆర్‌టీసీ బస్టాండ్ కలిపి ఐదు సెగ్మెంట్ల పనుల్లో వేగం పెంచాలని కోరారు. సుబ్బలక్ష్మి సర్కిల్ నుంచి రామానుజ సర్కిల్ వరకు పనులు ప్రారంభించడానికి ముందే పోలీస్ శాఖకు సమాచారం అందించి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో మ్యాన్‌పవర్‌ను పెంచాలని ఆయన సూచించారు.జేఈఓలు శ్రీమతి సదా భార్గవి, వీరబ్రహ్మం, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కుమారి అనుపమ అంజలి, ఎఫ్ఏసీఏఓ బాలాజి, టీటీడీ చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఎస్ఈలు మోహన్, జగదీశ్వర్‌రెడ్డి, స్మార్ట్ సిటి కార్పొరేషన్ జీఎం చంద్రమౌళి తదితర అధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

మూడు చోట్ల కార్తీక దీపోత్సవాలు : టీటీడీ

తిరుపతి, అక్టోబర్ 29: టీటీడీ ఆధ్వర్యంలో మూడు చోట్ల కార్తీక దీపోత్సవాలను నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని టీటీడీ జేఈవో సదా భార్గవి అధికారులను ఆదేశించారు. నవంబరు 7న యాగంటి, 14న విశాఖపట్నం, 18న తిరుపతిలో ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. టీటీడీ పరిపాలన భవనంలో శనివారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా తిరుమల శ్రీవారి, తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి లడ్డూ ప్రసాదాలను భక్తులకు అందుబాటులో ఉంచే విధంగా ఆలయాల డిప్యూటీ ఈవోలు ఏర్పాట్లు చేయాలని సూచించారు.

అన్నమాచార్య ప్రాజెక్ట్ నుంచి తగినంతమంది గాయకులను కార్తీక దీపోత్సవాలకు పంపడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్తీక మాసం విశిష్టత, భక్తులు చేయాల్సిన, చేయకూడని పనులు తెలిపే కరపత్రాలు ప్రెస్ ప్రత్యేకాధికారి సిద్ధం చేయాలని జేఈవో అన్నారు. స్టేజీ, బారికేడ్లు, ఇతర ఇంజినీర్ ఏర్పాట్ల పనులు ముందుగానే చేపట్టాలని చీఫ్ ఇంజినీర్‌కు సూచించారు. స్థానిక పోలీసులతో సమన్వయం చేసుకుని భద్రత, పార్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు.

సమావేశంలో తిరుమల శ్రీవారి ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాల దీక్షితులు, ఎస్వీబీసీ సీఈవో షణ్ముక్ కుమార్, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు ఇతర అధికారులు పాల్గొన్నారు. చిన్న పిల్లల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ పనుల పరిశీలన అనంతరం జేఈవో సదా భార్గవి అధికారులతో కలసి చిన్న పిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు.

ఆర్థిక సహాయం అందజేత

ఖమ్మం, అక్టోబర్ 20: (నేటినిజం ప్రతినిధి): జిల్లాలోని హోంగార్డు ఆఫీసర్స్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేసిన పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్.

విద్య రంగంలో ప్రతిభతో రాణిస్తున్న హోంగార్డు కుటుంబసభ్యులోని విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్ అలాగే అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కోన హోంగార్డులకు మంజూరైన మెడికల్ బిల్లుల మొత్తాన్ని పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా అందజేశారు.

అదేవిధంగా విధి నిర్వహణలో భాగంగా మరణించిన హోంగార్డు బాధిత కుటుంబాలకు నగదు చెక్కులను పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా బాధితులు అందజేశారు.

45 మంది హోంగార్డు ఆఫీసర్స్ కుటుంబాలకు మొత్తం రూ,, 4,57,000/- (నాలుగు లక్షల యాభై ఏడు వేలు) అందజేశారు.

కార్యక్రమంలో ఆర్ఐ శ్రీశైలం, హోంగార్డు అసోసియేషన్ రఫీ పాల్గొన్నారు.

మునుగోడులో కోదాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ మద్దతు

- రవాణా శాఖ మంత్రి పువ్వాడను కలిసి సంఘీభావం ప్రకటన
- సమస్యల పరిష్కారంపై హామీ ఇచ్చిన మంత్రి పువ్వాడ

ఖమ్మం, అక్టోబర్ 20: (నేటినిజం ప్రతినిధి): లారీ డ్రైవర్లు, యజమానుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషిచేస్తున్నదని, ఇంకా ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తెస్తే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ హామీ ఇచ్చారు. మునుగోడు ఉప ఎన్నిక నేపథ్యంలో తెరాస పార్టీకి కోదాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ వారు మంత్రి అజయ్‌ను కలిసి మద్దతు ప్రకటించారు.

ఈ సందర్భంగా కోదాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ వారు రూపొందించిన ప్రచార కర్రపత్రాలను ఆవిష్కరించిన అనంతరం మంత్రి మాట్లాడారు సంస్కరణల పేరుతో కేంద్రం రవాణా రంగాన్ని కుదేలు చేసిందని, తెలంగాణ రాష్ట్రంలో సింగిల్ పర్మిట్‌తోపాటు యాక్సిడెంట్ కేసుల సందర్భంలో డ్రైవర్ల లైసెన్స్‌లను రద్దు చేయడం వంటి అనేక సమస్యలను సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపినట్టు తెలిపారు.ఏ రాష్ట్రంలో లేనివిధంగా గ్రీన్ ట్యాక్స్‌ను తగ్గిస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదన్నారు.

చరిత్రలో నేటినిజం

నవ్య వాతావరణ ఆలోచనలకు శ్రీకారం 'మిషన్ లైఫ్'

సుస్థిర జీవనశైలి సారాంశంగా ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనీ గుటేర్రస్ సమక్షంలో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'మిషన్ లైఫ్' అనబడే నవ్య ఆలోచనలకు గుజరాత్‌లోని స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ సాక్షిగా శ్రీకారం చుట్టడం ఆహ్వానించదగ్గ పరిణామమే. ప్రతికూల వాతావరణ మార్పులు, భూతాపం లాంటి పర్యావరణ సవాళ్ళను ప్రపంచ మానవాళి అనుభవిస్తున్నది. దేశంలోని ప్రతి ఒక్క పౌరుడి పర్యావరణహిత జీవనశైలి మార్పుల సహాయంతో వాతావరణ సానుకూల మార్పులు సుసాధ్యమనే లక్ష్యంతో 'మిషన్ లైఫ్' ప్రారంభించబడింది. ఈ సందర్భంగా లైఫ్ (లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్) మిషన్ లోగో, ట్యాగ్‌లైన్లను గుటేర్రస్ విడుదల చేసి భారత ప్రభుత్వ చొరవను ప్రశంసించారు.

మిషన్ లైఫ్ లక్ష్యాలు:

పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి సమతుల్యత, వాతావరణ సానుకూల మార్పులు, పునరుత్పాదక శక్తి వనరుల వినియోగాల దిశగా లైఫ్ మిషన్ అడుగులు వేస్తున్నదని తెలుస్తున్నది. సౌర విద్యుత్తు ప్లాంట్ల స్థాపన, కరువు ప్రాంతాల్లో నీటి పరిరక్షణతో పాటు ఆదా చేయడం లాంటి చర్యల ద్వారా పర్యావరణ విపత్తులను నివారించవచ్చని అభిప్రాయపడుతున్నారు. మిషన్ లైఫ్ లక్ష్యాల్లో 'ప్రో-ప్లానెట్ పీపుల్ (భూగ్రహ పరిరక్షణ జనదళం)' ద్వారా భూగ్రహ ఆరోగ్యం సిద్ధిస్తుదని అంచనా వేస్తున్నారు. ప్రశాంత, సుస్థిర భూగ్రహం పుణ్యాన మాత్రమే మానవ సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని నమ్మాలి. గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం, నీతి ఆయోగ్, పర్యావరణ మంత్రిత్వశాఖల సంయుక్త నిర్వహణలో మిషన్ లైఫ్ ప్రారంభించబడింది.

గోరుచుట్టుపై రోకలి పోటు:

ప్రపంచ జనాభాకు దెబ్బ మీద దెబ్బ తగులుతోంది. కరోనా విపత్తు మిగిల్చిన విధ్వంసాలను మరువక ముందే ఉక్రెయిన్-రష్యా యుద్ధం ప్రపంచ దేశాలను కుదేలు చేస్తున్న వేళ గోరుచుట్టుపై రోకలి పోటులా పర్యావరణ, వాతావరణ సంక్షోభాలు ప్రపంచ మానవాళిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. గత దశాబ్దకాలంలో 9 ఏండ్ల పాటు అత్యధిక వడగాలులను మానవాళి చవిచూసింది. వాతావరణ ప్రతికూల విపత్తుల కట్టడికి వ్యక్తులు, సమాజం, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వాలు చేయి చేయి కలుపాల్సి ఉంటుందని ఇప్పటికైనా నమ్మాలి. సుస్థిరాభివృద్ధి, సుస్థిరత, ఆర్థిక ప్రగతి ఏకకాలంలో సుసాధ్యం కావడానికి 'రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్' అనే సూత్రాలకు కట్టుబడి ఉండాలని సూచిస్తున్నారు.

పునరుత్పాదక శక్తి వనరులు:

ఇండియాలో ఏడాదికి తలసరి కార్బన్ ఫూట్‌ప్రింట్ 1.5 టన్నులు ఉండగా, ప్రపంచ సగటు 4 టన్నులుగా నిర్ధారణ అయ్యింది. ప్రపంచ స్థాయిలో పునరుత్పాదక శక్తి వినియోగంలో ఇండియా 4వ స్థానంలో ఉండడం కొంత ఊరటను ఇస్తున్నది. పవన శక్తిలో 4వ స్థానం, సౌరశక్తిలో 5వ స్థానంలో ఉన్న ఇండియాలో గత 8 ఏండ్లలో పునరుత్పాదక శక్తి సామర్థ్యంలో 290 శాతం వృద్ధిని సాధించడం సంతోషదాయకం. శిలాజ ఇంధనేతర వనరులతో విద్యుచ్ఛక్తి ఉత్పత్తిలో 40 శాతం వృద్ధిని త్వరితగతిన చూపడం కూడా అభినందనీయం. జీరో కార్బన్ ఉద్గార స్థితికి చేరడానికి పర్యావరణహిత 'నేషనల్ హైడ్రోజన్ మిషన్' కూడా దోహదపడుతున్నది.

పర్యావరణహిత జీవనశైలి:

పర్యావరణ విధ్వంసం, వాతావరణ ప్రతికూల మార్పులు, హరిత గృహ ప్రభావంతో భూతాపం, తీవ్ర వడగాలులు, అకాల వర్షాలు, ప్రకృతి విపత్తులు, అతివృష్టి, అనావృష్టి, శబ్ద కాలుష్యం లాంటి అనేక అంశాలకు సమాధానంగా అన్ని దేశాలు, పౌరసమాజం తమ తమ కర్తవ్యాలను నిర్వహించాలి. పాలసీల్లో అవసర సంస్కరణలు, అమలులో చిత్తశుద్ధి, ఆర్థిక ప్రోత్సాహకాల వంటి పాలనాపరమైన చర్యలు చేపట్టాలి. వ్యక్తులు, సమాజం ఆలోచించి అడుగులు వేస్తే పర్యావరణ, వాతావరణ సంక్షోభాల నుంచి అనతికాలంలోనే ఉపశమనం దొరుకుతుంది.

ప్రపంచ జనాభా 8 బిలియన్లలో కనీసం ఒక్క బిలియన్ జనులు సన్మార్గంలో నడిసినా పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుంది. 2021లో గ్లాస్గోలో నిర్వహించిన సిఓపి-26 (కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్-26) వాతావరణ మార్పుల సమావేశంలో మోదీ చేసిన 'మిషన్ లైఫ్' వాగ్దానం నేడు సాకారం అవుతున్నది. నవంబర్ 2022లో ఈజిప్ట్ నగరమైన శర్మ్ ఎల్-షేక్ జరుగనున్న సిఓపి-27 సమావేశంలో వాతావరణ మార్పులతో జరుగుతున్న విపత్తుల నివారణ, కార్బన్ ఉద్గారాల కట్టడి, పర్యావరణ పరిరక్షణ చర్యలు, నిధుల సమీకరణ లాంటి అంశాలను 197 దేశాల ప్రతినిధుల బృందాలు చర్చించుట జరుగుతుంది.

చేయి చేయి కలిస్తేనే చైతన్యం:

వ్యక్తుల జీవనశైలి పర్యావరణ ఆరోగ్యాన్ని పోషించేదిగా ఉండాలని, బిందువు బిందువు కలిస్తేనే సాగరం అవుతుందని, చేయి చేయి కలిస్తేనే చైతన్యం వెల్లివిరుస్తుందని లైఫ్ మిషన్ వివరిస్తున్నది. వాతావరణహిత సామాజిక కట్టుబాట్లు, నమ్మకాలు, గృహ సంబంధ అలవాట్లు, సాంస్కృతిక వైవిధ్యాలను వాతావరణ హితంగా మార్చుకోవాల్సి సమయం ఆసన్నమైంది. ఆలోచనాత్మకంగా వస్తు వినియోగాలతో పాటు సానుకూల జీవన విధానాలపై దృష్టి కేంద్రీకరించాలి. అనవసర వినియోగాలతో సంపద వ్యర్థం కావడమే కాకుండా పర్యావరణ విచ్ఛిన్నానికి దోహదపడుతుందని గమనించాలి. స్వచ్ఛ భారత్ మిషన్ విజయవంతం కావడంతో ప్రజారోగ్యం కొంత వరకు మెరుగుపడింది.

ఇండియా చేపట్టిన మిషన్ లైఫ్‌లో దేశంలోని 1.4 బిలియన్ల ప్రజలు పర్యావరణహిత జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారా ప్రపంచ మానవాళికి మార్గదర్శనం చేస్తున్నది. అల్పాదాయ దేశాల పోల్చితే సంపన్న దేశాల ఉద్గారాలు 80 రెట్లు ఎక్కువని గమనించాలి.

ప్రకృతి, పర్యావరణం, వాతావరణాలు మన నుండి ఏ ప్రయోజనాలు ఆశించవు. మనిషి మాత్రమే వాటిని వాడుకుంటూ, విధ్వంసం చేస్తూ స్వార్థపూరితంగా నడుస్తున్నాడని, మనం సకాలంలో మేల్కొనని ఎడల భూమి నిప్పుల కుంపటి అవుతుందని, సకల జీవులు మాడి మసి బొగ్గు కావలసిందే అని తెలుసుకోవాలి. తను కూర్చున్నా కొమ్మను తానే నరుక్కోవద్దని తెలుసుకొని, దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకుందాం. భూగ్రహాన్ని నివాసయోగ్య ఆవాస స్వర్గంగా మార్చుకుందాం. మిషన్ లైఫ్‌లో స్వచ్ఛందంగా భాగస్వాములమ వుదాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

అజారుద్దీన్ ని పరామర్శించిన ..మంత్రి హరీశ్ రావు

హైదరాబాద్, అక్టోబర్ 28:రీసెంట్ గా అజారుద్దీన్ తండ్రి మహమ్మద్ అజీజుద్దీన్ కన్నుమూశారు.. ఈ సందర్భంగా శనివారం హైదరాబాదులోని అజారుద్దీన్ నివాసానికి వెళ్లి తెలంగాణ వైద్యారోగ్యశాఖ మంత్రి హరీష్ రావు పరామర్శించారు. పితృవియోగ భాదనుంచి అజారుద్దీన్ త్వరగా కోలుకోవాలని? ఆకాంక్షించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కాగా అజారుద్దీన్ తండ్రి అజీజుద్దీన్ సుదీర్ఘకాలంగా ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతూ.. పరిస్థితి విషమించడంతో ఈ నెల 18న కన్నుమూశారు.

తెలంగాణ డయాగ్నొస్టిక్స్‌కు జాతీయ గుర్తింపు.. హర్షం వ్యక్తం చేసిన హరీశ్‌రావు

హైదరాబాద్, అక్టోబర్ 29:నాణ్యమైన వైద్యం మాత్రమే కాదు, నాణ్యమైన రోగ నిర్ధారణ పరీక్షలు సైతం ఉచితంగా అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ డయాగ్నొస్టిక్ సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. పరీక్షల నిర్వహణ, ఫలితాల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నందుకు తెలంగాణ డయాగ్నొస్టిక్ సెంట్రల్ ల్యాబ్‌కు మెడికల్ టెస్టింగ్ విభాగంలో నేషనల్ అక్రిడేషన్ బోర్డు ఫర్ టెస్టింగ్ అండ్ కాల్బ్రేషన్ లాబొరేటరీస్ (ఎన్ఏబీఎల్) సర్టిఫికేషన్ లభించింది.

దీనిపై ఆర్థిక, వైద్యారోగ్య మంత్రి హరీశ్ రావు హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు కృషి చేసిన వైద్య సిబ్బందికి మంత్రి అభినందనలు తెలిపారు. డయాగ్నొస్టిక్ కేంద్రాలు పేదలకు వైద్య పరీక్షల భారం నుంచి ఉపశమనం కలిగిస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనతో అన్ని జిల్లాలో వీటిని ప్రారంభించి 57 రకాల రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షల సంఖ్యను పెంచేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

హజీరాలో 'అర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా' ప్లాంటు విస్తరణ సందర్భంగా ప్రధానమంత్రి ప్రసంగం

న్యూఢిల్లీ, అక్టోబర్ 29: గుజరాత్‌లోని హజీరాలో నేడు 'అర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా' (ఎంఎ/ఎన్ఎస్- ఇండియా) ప్లాంటు విస్తరణ కార్యక్రమం నేపథ్యంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం ద్వారా ప్రసంగించారు. ఈ సందర్భంగా- ఉక్కు కర్మాగారం ద్వారా పెట్టుబడులు రావడంతోపాటు అనేక కొత్త అవకాశాలకు తలుపులు తెరుచుకుంటున్నాయని ఆయన అన్నారు. "రూ.60వేల కోట్లకుపైగా పెట్టుబడితో గుజరాత్ నహా దేశవ్యాప్తంగా అనేక ఉద్యోగ అవకాశాల సృష్టికి వీలు కలుగుతుంది. ఈ విస్తరణ తర్వాత హజీరా స్టీల్ ప్లాంట్‌లో ముడి ఉక్కు ఉత్పాదక సామర్థ్యం 9 మిలియన్ టన్నుల నుంచి 15 మిలియన్ టన్నులకు పెరుగుతుంది" అని ఆయన తెలిపారు.

భారత్ 2047నాటికి ప్రగతిశీల దేశంగా ఆవిర్భవించడంలో ఉక్కు పరిశ్రమ రంగం పాత్ర పెరుగుతుండటాన్ని ప్రధాని నొక్కిచెప్పారు. బలమైన ఉక్కు రంగంతో బలమైన మౌలిక సదుపాయాలకు బాటలు పడతాయని పేర్కొన్నారు. అదేవిధంగా రహదారులు, రైల్వేలు, విమానాశ్రయాలు, ఓడరేవులు, నిర్మాణ రంగం, ఆటోమోటివ్, మూలధన వస్తూత్పత్తి, ఇంజనీరింగ్ ఉత్పత్తుల రంగాలకు ఉక్కు రంగం ప్రధాన పాత్ర పోషిస్తుంది.

ఈ ప్లాంటు విస్తరణతోపాటు ఎలక్ట్రిక్ వాహనాలు, ఆటోమొబైల్, ఇతర ఉత్పాదక రంగాల్లో భారీ తోడ్పాటు దిశగా మన దేశానికి కొత్త సాంకేతిక పరిజ్ఞానం పూర్తిస్థాయిలో వస్తుందని ప్రధానమంత్రి అన్నారు. "అర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా ప్రాజెక్టు 'భారత్‌లో తయారీ' దృక్కోణంలో ఒక మైలురాయిగా రుజువు చేసుకోగలదని నేను గట్టిగా విశ్వసిస్తున్నాను. అదేవిధంగా ప్రగతిశీల-స్వయం సమృద్ధ భారత దేశం దిశగా ఉక్కు రంగంలో మనం కృషి కొత్త బలాన్నిస్తుంది" అని ప్రధానమంత్రి అన్నారు.

భారతదేశం పై ప్రపంచం పెట్టుకొన్న ఆశల ను గురించి ప్రధాన మంత్రి ప్రస్తావిస్తూ, భారతదేశం ప్రపంచం లోనే అతి పెద్ద తయారీ కేంద్రం గా మారే దిశ లో శర వేగం గా సాగిపోతోందని, ప్రభుత్వం ఈ రంగం యొక్క వికాసానికి అవసరమైన విధానాల ను రూపొందించడం లో క్రియాశీలం గా నిమగ్నం అయిందన్నారు. "గత ఎనిమిది సంవత్సరాలు గా అందరి ప్రయాస ల వల్ల భారతదేశం యొక్క ఉక్కు పరిశ్రమ ప్రపంచం లో ఉక్కు ను ఉత్పత్తి చేస్తున్న రెండో అతి పెద్ద పరిశ్రమ గా ఆవిర్భవించింది. ఈ పరిశ్రమ అభివృద్ధి చెందడానికి అపారమైన సంభావ్యత ఉంది" అని కూడా ఆయన అన్నారు.

భారతదేశం ఉక్కు పరిశ్రమ ను మరింత గా ప్రోత్సహించడానికి సంబంధించిన చర్యల ను గురించి ప్రధాన మంత్రి వివరించారు. పిఎల్ఐ పథకం ఈ పరిశ్రమ యొక్క వృద్ధి కి సరికొత్త మార్గాల ను తెరచింది అని ఆయన అన్నారు. ఐఎన్ఎస్ విక్రాంత్ యొక్క ఉదాహరణ ను గురించి ప్రధాన మంత్రి ప్రస్తావించి, హై-గ్రేడ్ స్టీల్ లో దేశం నైపుణ్యాన్ని సంపాదించింది. ఈ హై-గ్రేడ్ స్టీల్ ను ఉపయోగించడం కీలకమైనటువంటి వ్యూహాత్మక ఏప్లికేశన్స్ లో అధికం అవుతున్నదని పేర్కొన్నారు. విమాన వాహక నౌకల లో ఉపయోగించేటటువంటి ప్రత్యేకమైన ఉక్కు ను డిఆర్ డిఒ కు చెందిన శాస్త్రవేత్తలు అభివృద్ధిపరచారు అని ప్రధాన మంత్రి అన్నారు. లోనీ కంపెనీ లు వేల కొద్దీ మిట్రిక్ టన్నుల ఉక్కు ను ఉత్పత్తి చేశాయి. మరి ఐఎన్ ఎస్ విక్రాంత్ అచ్చంగా స్వదేశీ సామర్థ్యం తో, సాంకేతిక విజ్ఞానం తో రూపొందింది. ఆ తరహా సామర్థ్యాన్ని పెంచడం కోసం, దేశం ఇక ముడి ఉక్కు ఉత్పత్తి సామర్థ్యాన్ని రెట్టింపు చేయాలన్న లక్ష్యాన్ని పెట్టుకొంది. మనం ప్రస్తుతం 154 మిట్రిక్ టన్నుల ముడి ఉక్కు ను ఉత్పత్తి చేస్తున్నాం. తదుపరి తొమ్మిది, పది సంవత్సరాల లో 300 ఎమ్ టి ఉత్పత్తి సామర్థ్యాన్ని సంపాదించుకోవాలన్నది మన లక్ష్యం గా ఉంది.

అభివృద్ధి తాలూకు దృష్టికోణం ఆచరణ రూపాన్ని సంతరించుకొంటూ ఉంటుందో, అప్పుడు ఎదురుపడేటటువంటి సవాళ్ల ను గురించి ప్రధాన మంత్రి చెప్తూ, ఉక్కు పరిశ్రమ నుండి వెలువడే కర్బన ఉద్గారాల తాలూకు ఉదాహరణ ను ప్రస్తావించారు. భారతదేశం ఒక వైపు నుండి ముడి ఉక్కు ను ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని విస్తరించుకొంటూనే మరి మరో వైపు నుండి పర్యావరణ మిత్రపూర్వకంగా ఉండేటటువంటి సాంకేతిక పరిజ్ఞ?నాన్ని ఉపయోగించడాన్ని ప్రోత్సహిస్తోందని ఆయన వివరించారు. "ప్రస్తుతం, భారతదేశం కర్బన ఉద్గారాల ను తగ్గించే కోవ కు చెందిన ఉత్పత్తి సంబంధి సాంకేతిక విజ్ఞ?నాన్ని అభివృద్ధిపరచడం పై శ్రద్ధ తీసుకోవడం తో పాటు గా కర్బనాన్ని వెలికి తీసి మరి దానిని రెండో సారి ఉపయోగించడానికి సైతం ప్రాధాన్యాన్ని కట్టబెడుతోంది" అని ప్రధాన మంత్రి అన్నారు. దేశం లో వృత్తాకార ఆర్థిక వ్యవస్థ కు కూడా ప్రోత్సాహాన్ని అందించడం జరుగుతున్నది; మరి ప్రభుత్వం , ఇంకా ప్రైవేటు రంగం ఈ దిశ లో కలసికట్టుగా పనిచేస్తున్నాయి అని కూడా ఆయన వెల్లడించారు. "ఎఎమ్ఎన్ఎస్ ఇండియా గ్రూపునకు చెందిన హజీరా ప్రాజెక్టు కూడాను హరిత సాంకేతిక పరిజ్ఞ?నాన్ని ఉపయోగించడం పట్ల అమిత ప్రాముఖ్యాన్ని ఇస్తుండడం అనేది నాకు సంతోషాన్ని కలిగిస్తోంది" అని ప్రధాన మంత్రి అన్నారు.

ప్రధాన మంత్రి తన ప్రసంగం చివర లో, ఎప్పుడైతే ప్రతి ఒక్కరు ఒక లక్ష్యం దిశ లో పూర్తి బలం తో సాగిపోయేందుకు కృషి చేయడం మొదలుపెడతారో, అప్పుడు దానిని చేరుకోవడం కష్టం కాదు." అన్నారు. ఉక్కు పరిశ్రమ ను కొత్త శిఖరాల కు తీసుకుపోవడానికి ప్రభుత్వం కంకణం కట్టుకొందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు యావత్తు ప్రాంతం యొక్క అభివృద్ధి కి మరియు ఉక్కు రంగం యొక్క అభివృద్ధి కి తప్పక ప్రేరణ ను ఇస్తుందని నేను తలుస్తున్నాను." అంటూ ప్రధాన మంత్రి తన ప్రసంగాన్ని ముగించారు.

నవంబర్ 12న పెద్దపల్లి జిల్లాకు ప్రధాని రాక..

కరీంనగర్, అక్టోబర్ 29 (నేటినిజం ప్రతినిధి): భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ నవంబర్ 12న తెలంగాణకు రానున్నారు. పెద్దపెల్లి జిల్లా రామగుండంలో రామగుండం ఎరువుల కర్మాగారాన్ని ప్రధాని మోదీ జాతికి అంకితం చేయనున్నారు. ప్రధాని పర్యటన కోసం ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. శనివారం కేంద్ర ఎరువుల రసాయన శాఖ కార్యదర్శి అరుణ్ సింఘాల్, పెద్దపెల్లి జిల్లా కలెక్టర్ సంగీత సత్యనారాయణ, రామగుండం పోలీస్ కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి, రామగుండం ఎన్టిపిసి సీజీఎం సునీల్ కుమార్, రామగుండం ఎరువుల కర్మాగారం జీఎం జా, ఎన్టిపీసీ పర్మినెంట్ టౌన్షిప్ లోని మహాత్మా గాంధీ స్టేడియంలోగల హెలిప్యాడ్ ను పరిశీలించారు. ప్రధాని సభ జరిగే ప్రాంగణంతో పాటు ఆర్ఎఫ్ సీఎల్ ఎరువుల కర్మాగారంలో ప్రధాని పర్యటన రూట్ మ్యాప్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీలు రూపేష్ కుమార్, అఖిల్ మహాజన్, రామగుండం మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు, రామగుండం సర్కిల్ ఇన్ స్పెక్టర్ కణతల లక్ష్మీనారాయణ, రామగుండం తాసిల్దార్ జహేద్ పాషా, ఆర్ ఎఫ్ సిఎల్ ఉన్నత అధికారులు, పలు విభాగాల ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

కాణిపాకం ఆలయంలో విలువైన నగ మాయం.. విచారణ జరిపిస్తామని మంత్రి హామీ

హైదరాబాద్, అక్టోబర్ 29:వేలూరు గోల్డెన్ టెంపుల్ కి చెందిన నారాయణ శక్తి అమ్మణ్ వరసిద్ధి వినాయకుడికి బంగారు విభూది పట్టీని సమర్పించారు. మహాకుంభాభిషేకంలో పాల్గొని ఈ కానుక సమర్పించారు. ఈ నగ విలువ సుమారు రూ.18 లక్షలు ఉంటుందని సమాచారం. అయితే, దీనికి సంబంధించి ఆలయ అధికారులు ఎలాంటి రసీదు ఇవ్వలేదు. తర్వాత ఇస్తామని చెప్పారని దాత వివరించారు. ఆలయ పునర్నిర్మాణం సందర్భంగా ఆగస్టు 27న నిర్వహించిన మహా కుంభాభిషేకంలో స్వామి వారికి ఈ నగను అలంకరించారు. తర్వాత బ్రహ్మోత్సవాలలోనూ ఉపయోగించారు. ఈ క్రమంలో రసీదు కోసం మరోసారి ఆలయ అధికారులను ఆశ్రయించగా.. నగ కనిపించట్లేదనే విషయం బయటపడిందని దాత చెప్పారు.

ఆలయ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే బంగారు విభూది పట్టీ మాయమైందని మంత్రులకు దాత ఫిర్యాదు చేశారు.దాంతో కాణిపాకం ఆలయంలో విలువైన నగ మాయమవడం సంచలనంగా మారింది. స్వామి వారికి భక్తితో దాత అందజేసిన విభూది పట్టీ కనిపించడంలేదని సమాచారం. దీంతో సదరు దాత ఈ విషయాన్ని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆపై దేవాదాయ మంత్రి కొట్టు సత్యనారాయణ దృష్టికి వెళ్లడంతో.. సమగ్ర విచారణ జరిపిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

చిలకలూరిపేటలో దారుణం.. గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం..

అమరావతి: అక్టోబర్ 29:పల్నాడు జిల్లా చిలకలూరిపేట పంట పొలాల్లో గుర్తు తెలియని మహిళా మృతదేహం లభ్యమైంది. మండలంలోని తాతపూడి పంచాయతీ పరిధిలో నేషనల్ హైవేకి పక్కన ఉన్న శ్రీ భువనేశ్వరి కోల్డ్ స్టోరేజ్ ప్రైవేట్ లిమిటెడ్ దగ్గరలో మహిళ మృతదేహాన్ని గుర్తించారు. తాతపూడి హైవే దగ్గర నుండి యద్దనపూడి మండలం సురవరపు గ్రామానికి వెళ్లే రోడ్డు దారిలోని మధ్య పొలంలో రాత్రి సమయంలో ఎవరైనా పడేసి వెళ్లి ఉంటారని అనుమానిస్తున్నారు. సమాచారం అందుకున్న చిలకలూరిపేట రూరల్ పోలీస్ సిబ్బంది వారు ఘటనా స్థలానికి చేరుకొని క్లూస్ టీమ్ కు సమాచారం అందించారు. మహిళ వయసు 33 సంవత్సరాలు ఉండొచ్చని పోలీసులు అంచనా వేశారు. మహిళ మృతదేహానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది అన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

ఏపీకి వర్ష సూచన.. దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో మూడు రోజులు వర్షాలు

అమరావతి: అక్టోబర్ 29:రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రాగల మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవచ్చని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. పశ్చిమ మధ్య, దానిని ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఇప్పుడు నైరుతి బంగాళాఖాతం మీదుగా ఉత్తర తమిళనాడు తీరంలో సగటు సముద్రంపై 1.5 కి.మీ నుంచి 4.5 కి.మీ మధ్యఉండి కొనసాగుతున్నది.

బంగాళాఖాతం మీదుగా దిగువ ట్రోపోస్ఫిరిక్ స్థాయిలలో ఈశాన్య గాలులు ఏర్పడే అవకాశం ఉంది. దక్షిణ ఇంటీరియర్ కర్ణాటక నుండి తమిళనాడు మీదుగా నైరుతి బంగాళాఖాతం వరకు ద్రోణి సముద్ర మట్టానికి సగటు 0.9 కి మీ ఎత్తు వద్ద ఉండి బలహీనపడింది. దీని ఫలితంగా శనివారం నుంచి మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ పేర్కొంది.

ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహితీ అవార్డు -2022!

కవి మిత్రులకు విజ్ఞప్తి

* 35 వ ' ఉమ్మడిశెట్టి సత్యాదేవి సాహితీ అవార్డు_2022' కోసం కవుల నుండి కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నాము.

* అవార్డు పరిశీలన కోసం 2022 సం.లో ప్రచురింప బడిన కవితా సంపుటాలను మాత్రమే పంపుకోవాలి.

*ఎంపికైన అవార్డు విజేతకు 6000 రూ నగదు మరియు షీల్డ్ తో సత్కారం ఉంటుంది.

* 31.12.2022 తేదీ లోగా నాలుగు ప్రతులు ఈ చిరునామాకు పంపి సహకరించగలరు

డా. ఉమ్మడిశెట్టి రాధేయ,
(అవార్డు వ్యవస్థాపకులు)
13.1.606.1 షిర్డీ నగర్,
రెవిన్యూ కాలనీ
అనంతపురం- 515001
మొబైల్:9985171411

నల్లమల్ల ఘాట్ రోడ్ లో భారీ ట్రాఫిక్ జామ్..

నంద్యాల, అక్టోబర్ 29: కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి నల్లమల్ల అడవుల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. తెల్లవారుజాము నుంచి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడడంతో ప్రయాణికులు గంటల తరబడి ఘాట్ మార్గంలోనే నరకయాతన పడుతున్నారు. ముఖ్యంగా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నల్లమల్ల అడవుల్లో ఘాట్ రోడ్లో లోడుతో వెళ్తున్న లారీ తిరగబడటమే వీటన్నిటికీ కారణమని తెలుస్తోంది. భారీ వాహనం చెడిపోవడంతో వాహనాలు అటు ఇటు వెళ్లేందుకు వీలు లేకుండా పోయింది. దీంతో గంటల తరబడి వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇక శ్రీశైలంకు వెళ్లే ప్రయాణికులతో ఆత్మకూరు బస్టాండ్ లో నిలిచి పోయారు.

వైద్యవిద్యకు స్వర్ణయుగం.. ఈ ఏడాది అదనంగా 746 సీట్ల పెంపు

అమరావతి: అక్టోబర్ 29: రాష్ట్రంలో వైద్య విద్యలో స్వర్ణయుగం నడుస్తోంది. వైద్య ఆరోగ్యరంగంపై సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టిసారించిన నేపథ్యంలో సత్ఫలితాలు వస్తున్నాయి. ఈ ఏడాది నుంచి రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో పీజీ సీట్లు గణనీయంగా పెరగనున్నాయి. ప్రమాణాలకు అనుగుణంగా సిబ్బందిని ఏర్పాటు చేయడంతో సీట్ల సంఖ్య పెంపుదలకు అనుమతి లభించింది. 2019 వరకూ రాష్ట్రంలో మెడికల్ పీజీ సీట్ల సంఖ్య 970 కాగా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన చర్యల ఫలితంగా 2022 ఎకడమిక్ ఈయర్‌కు మరో 207 సీట్లు పెరిగాయి.

ఇప్పుడు అదనంగా 746 సీట్లకు దరఖాస్తు చేసేందుకు అవకాశం దక్కింది. ఈ ఏడాదిలో ఈ సీట్లు పెరుగుదల దాదాపు ఖయమైపోయింది. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 2019 వరకూ మొత్తంగా రాష్ట్రంలో ఉన్న పీజీ సీట్లు 970 అయితే ఈ మూడున్నరేళ్లలోనే మరో 953 సీట్లు పెరగడం వైద్యవిద్యలో అరుదైన ఘట్టంగా సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

మూడున్నర ఏళ్లలో రెట్టింపు

మూడున్నరేళ్లలోనే మెడికల్ పీజీసీట్లు రెట్టింపు అవ్వడం ద్వారా పెద్ద సంఖ్యలో వైద్య నిపుణులు అందుబాటులోకి రానున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైద్య బోధనా సిబ్బంది నియామకాలపై వైసీపీ సర్కార్ ప్రత్యేక దృష్టిసారించింది. 1254 అసిస్టెంట్ ప్రొఫెసర్లని నియమించారు. 106 ప్రొఫెసర్, 312 అసోసియేట్ ప్రొఫెసర్, 832 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను ప్రభుత్వం సృష్టించింది. వీటిని భర్తీ చేసే ప్రక్రియనే వేగవంతం చేసింది. అవసరమనుకుంటే ప్రైవేటు- రంగంలో ఇచ్చే భారీ వేతనాలను ప్రభుత్వరంగంలోనూ ఇవ్వాలని ముఖ్యమంత్రి ఇప్పటికే ఆదేశాలు జారీచేశారు.

వాక్‌ఇన్ ఇంటర్వ్యూ పద్ధతులను వైద్యారోగ్యశాఖ అవలంబించడం వల్ల ప్రభుత్వ మెడికల్ పీజీ సీట్ల పెరుగుదలకు మార్గం సుగమమైందని, ఇది ఒక శుభపరిణామమని అధికారులు పేర్కొంటున్నారు. దీనివల్ల స్పెషాల్టీ, సూపర్ స్పెషాల్టీ వైద్య సేవలు గణనీయంగా మెరుగుపడ్డమే కాకుండా, వైద్య రంగంలో నిపుణుల సంఖ్య పెరుగుతుందన్నారు. రాష్ట్రంలో కొత్తగా నిర్మాణం అవుతున్న మెడికల్ కాలేజీల్లో బోధనావసరాలకు ఇది ఉపయోగపడుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న 17 మెడికల్ కాలేజీలు పూర్తైతే, నిర్ణీత సమయానికి సుమారు మరో 3 వేల పీజీసీట్లు కూడా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

ఎయిర్ ఇండియా ప్రక్షాళన : రూ 15,000 కోట్ల రుణాల కోసం బ్యాంకులతో టాటా సంప్రదింపులు

న్యూఢిల్లీ, అక్టోబర్ 29: ఎయిర్ ఇండియాను చేజిక్కించుకున్న టాటా గ్రూప్ ఎయిర్‌లైన్‌ను ఫ్లాగ్‌షిప్ కంపెనీగా మలిచేందుకు అవసరమైన వ్యూహాలకు పదునుపెడుతోంది. ఎయిర్ ఇండియా పునరుద్ధరణ కోసం రూ 15,000 కోట్ల వర్కింగ్ క్యాపిటల్ రుణాలకు బ్యాంకులతో టాటా గ్రూప్ సంప్రదింపులు జరుపుతోంది. ఎయిర్ ఇండియాను ప్రతిష్టాత్మక సంస్థగా తీర్చిదిద్దుతామని గతంలో టాటా సన్స్ చీఫ్ ఎన్ చంద్రశేఖరన్ చేసిన ప్రకటనను సాకారం చేసే దిశగా కార్యాచరణకు కంపెనీ కసరత్తు సాగిస్తోంది.

వర్కింగ్ క్యాపిటల్ రుణాల ద్వారా ఎయిర్ ఇండియా రోజువారీ ఆపరేషన్స్‌ను చేపడుతూ నష్టాలను భర్తీ చేసుకునేందుకు టాటా గ్రూప్ యోచిస్తోంది. విమాన అద్దెలు, విమానాల సంఖ్య పెంపు, ఐటీ కార్యకలాపాల ప్రక్షాళనకూ ఈ నిధులను వెచ్చించాలని కంపెనీ భావిస్తోంది. గత ఏడాది ఎయిర్ ఇండియా బిడ్‌లో గెలుపొందిన అనంతరం టెలేస్ రూ 23,000 కోట్ల అన్‌సెక్యూర్డ్ రుణాన్ని ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడాల నుంచి 4.25 శాతం వడ్డీపై సమీకరించింది.

మార్చి 2021 నాటికి టాటా సొంతమైన ఎయిర్ ఇండియా సంచిత నష్టాలు రూ 83,916 కోట్లకు చేరగా, 2022 ఆర్థిక సంవత్సరంలో మరో రూ 9556 కోట్ల నష్టాలను నమోదు చేసింది. ఎయిర్ ఇండియాను టేకోవర్ చేసినప్పటి నుంచి ఎయిర్‌లైన్‌ను ప్రక్షాళన చేసేందుకు టాటా గ్రూప్ పలు చర్యలు చేపడుతోంది. పేలవంగా ఉన్న కస్టమర్ సర్వీసును మెరుగుపరచడం నుంచి విమానాల సంఖ్యను పెంచడం వరకూ సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అందుకు అనుగుణంగా ముందుకెళుతోంది. ఇందులో భాగంగా రానున్న ఐదేండ్లలో 113 విమానాల సామర్థ్యాన్ని మూడు రెట్లు పెంచాలని నిర్ణయించింది.

తియ్యని శత్రువుపై అప్రమత్తతే ఆయుధం..!

- కాలి గాయమే ప్రాణాల మీదికి తేవొచ్చు
- డయాబెటిస్ ఉన్న వారికి పాదాల సంరక్షణ తప్పనిసరి
- ఖమ్మంలోని ప్రముఖ డయాబెటిస్ ఫుట్ సర్జన్, ఎం.ఎస్ బీసం వెంకటేశం
- ఇకపై "ఆర్క" హాస్పిటల్ లో పూర్తి స్థాయి సేవలు డయాబెటిస్..! ఇదో తియ్యని శత్రువు..

ఖమ్మం, అక్టోబర్ 29 (నేటినిజం ప్రతినిధి) :మన శరీరంలోనే కనిపించకుండా దాగి ఉండి మనతోనే నిత్యం యుద్ధం చేసే మహమ్మారి, అందుకే మధుమేహం ఉన్న వారికి బయటి శత్రువుతో పనిలేదని అంటూ ఉంటారు. ఎందుకంటే ఒంట్లో శత్రువుతో యుద్ధం చేయడంతోనే అతను అలసిపోతాడు కనుక.! ఈ వ్యాధిబారిన పడిన వారు తినే తిండి విషయంలో జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు మనం నడవడానికి ఉపకరించే పాదాలను కూడా అత్యంత జాగ్రత్తగా పరిరక్షించుకోవాలని అంటున్నారు. ఖమ్మంలోని ప్రముఖ డయాబెటిస్ ఫుట్ సర్జన్, ఎం.ఎస్ సర్జన్ డాక్టర్ బీసం. వెంకటేశం, ఖమ్మంలోని "ఆర్క" వైద్యశాలలో ఇకపై తన పూర్తి సమయాన్ని రోగుల కోసం కేటాయిస్తానంటున్న ఆయన పత్రికా విలేకరుల సమావేశంలో తన స్పెషలైజేషన్ అయిన డయాబెటిస్ పై ముచ్చటించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశం మాట్లాడుతూ... డయాబెటిస్ వ్యాధి శరీరంలోని అవయవాల పని తీరుపై ప్రభావం చూపుతుందని చాలా మందికి తెలుసు. కానీ షుగర్ ఉన్న వారిలో పాదాల సమస్యలు కూడా తలెత్తుతాయని మాత్రం చాలా తక్కువ మందికి తెలుసు. వాస్తవానికి ఇది సర్వ సాధారణ విషయమే, డయాబెటిస్‌తో బొటనవేలు, పాదం లేక కాలును సైతం కోల్పోయిన సందర్భాలు లేకపోలేదు. కానీ ప్రతి రోజూ పాదాలను జాగ్రత్తగా సంరక్షించుకోవడం ద్వారా మధుమేహానికి సంబంధించిన పాదాల సమస్యలను అధిగమించవచ్చు. నిర్లక్ష్యం వహిస్తే కాలి గాయమే ప్రాణాల మీదికి తెస్తుంది.

- పాదాలను ఎలా ప్రభావితం చేస్తుందంటే...

కాలానుగుణంగా మధుమేహం వల్ల నరాలు దెబ్బతినవచ్చు, దీన్ని "డయాబెటిక్ న్యూరోపతి" అని పిలుస్తారు. ఇది జలదరింపు, నొప్పిని కలిగిస్తుంది. అలాగే పాదాల్లో స్పర్శ అనుభూతిని కోల్పోయేలా చేస్తుంది. ఈ పరిస్థితి పుండ్లకు దారితీసే ప్రమాదాన్ని కల్పిస్తుంది. మధుమేహం సర్వ సాధారణ లక్షణం పాదాలలో రక్త ప్రవాహాన్ని తగ్గించడం, కాళ్లు, పాదాలకు తగినంత రక్తం ప్రవహించకపోవడం వల్ల పుండ్లు లేక ఇన్ఫెక్షన్ ఏర్పడుతుంది. ఇవి నయం కావడం కష్టంగా మారుతుంది. కొన్నిసార్లు తీవ్రంగా ఇన్ఫెక్షన్ సోకి పుండు ఎప్పుడూ నయం కాని స్థితిని కలిగిస్తుంది. అలాంటప్పుడు చెడు ఇన్ఫెక్షన్ శరీరంలోని మిగిలిన భాగాలకు వ్యాపించకుండా జాగ్రత్త పడాల్సి ఉంటుంది. డయాబెటిస్ రోగులు ఇలాంటి తీవ్రమైన పరిస్థితి రాకుండా ఉండటానికి నిత్యం పాదాల సంరక్షణ అనివార్యం.

- పాదాలను పరిరక్షణకు ఏం చేయాలంటే...?

డయాబెటిస్ వ్యాధిగ్రస్తులు తమ ఆరోగ్య ప్రణాళికలో పాదాల సంరక్షణను చేర్చుకోవాలి. ఫుట్ డాక్టర్, పాడియాట్రిస్ట్ సలహాలు తీసుకోవడం అవసరం, అలాగే ప్రతి రోజూ పాదాలను తనిఖీ చేసుకోవాలి. పాదాలను నిత్యం కడుక్కోవాలి.

మొక్కజొన్న పిండి లేక కాలిన్‌లను సున్నితంగా స్మూత్ చేసుకోవాలి. గోళ్ళను అడ్డంగా కత్తిరించుకోవాలి.

అన్ని సమయాల్లో బూట్లు, సాక్స్ ధరించాలి.

పాదాలను తీవ్రమైన వేడి అలాగే చలి నుంచి రక్షించుకోవాలి. పాదాలకు రక్త ప్రసరణ జరిగేలా ప్రయత్నం చేయాలి. ప్రతిరోజూ పాదాలను తనిఖీ చేసుకోవడం ద్వారా సమస్యను ముందే గుర్తించవచ్చు. ప్రతి సాయంత్రం షూలను తీసివేసినప్పుడు మీ పాదాలను తనిఖీ చేయడం అలవర్చుకోవాలి. కోతలు, పుండ్లు, లేక ఎర్రటి మచ్చలు, వాపు, ద్రవంతో నిండిన బొబ్బలు కనిపిస్తే అప్రమత్తం అవ్వాల్సిన సమయం వచ్చిందని తెలుసుకోవాలి. పాదంలో పుండ్లు వచ్చే అవకాశం ఉంటే పాదాల వివిధ భాగాల్లో చర్మం ఉష్ణోగ్రతను తీసుకోమని డాక్టర్ కు సిఫారసు చేయవచ్చు. అది ఒక "హాట్ స్పాట్" ఒక పొక్కు లేక పుండు మొదలవుతుందనడానికి మొదటి సంకేతంగా భావించాలి. నిత్యం పాదాలను వేడి నీటితో సబ్బును ఉపయోగించి కడగాలి. పాదాలను కడిగి ఎండబెట్టిన తర్వాత కాలి మధ్య టాల్కమ్ పౌడర్ లేక మొక్కజొన్న పిండిని ఉంచాలి. కాలి మధ్య లోషన్ లేక క్రీమ్ పెట్టవద్దు. మీ గోళ్ళను నేరుగా అడ్డంగా కత్తిరించండి. అవసరమైనప్పుడు గోళ్ళను కత్తిరించుకోవాలి.

ఇక అన్ని సమయాల్లో బూట్లు, సాక్స్, ధరించడం ఉత్తమం. తేలికగా మెత్తని సాక్స్‌లను ఎంచుకోవాలి. వాకింగ్ షూస్, అథ్లెటిక్ షూస్, రోజు వారీ ధరించడానికి మంచివిగా భావించవచ్చు.

- పాదాల రక్త ప్రసరణకు ఇలా...

కూర్చున్నప్పుడు పాదాలను పైకి లేపాలి. రోజంతా కొన్ని నిమిషాల పాటు కాలి వేళ్లను కదిలించడం అలవాటుగా మార్చుకోవాలి.

గట్టి సాక్స్ లేక సాగే మేజోళ్ళను అస్సలు ధరించవద్దు. శారీరకంగా మరింత చురుకుగా ఉండాలి. వాకింగ్, డ్యాన్స్, యోగా, లేదా స్ట్రెచింగ్, స్విమ్మింగ్ లేక బైక్ రైడింగ్ వంటి పాదాలకు సులభంగా ఉండే కార్యకలాపాలను ఎంచుకోండి. ధూమపానానికి దూరంగా ఉండాలి.

- ఇలా అనిపిస్తే డాక్టర్ దగ్గరికి వెళ్ళండి...

రోజులు గడుస్తున్నప్పటికీ గాయాలు నయంకాని పరిస్థితి, కోత, పొక్కు, లేక పాదాల చర్మం ఎర్రగా మారడం, వెచ్చగా లేక బాధ కలిగించడం జరిగితే వెంటనే డాక్టర్ ని సంప్రదించడం ఉత్తమం. ఇవి తీవ్ర పరిణామాలని కలిగించే అవకాశం ఉంది. అవసరమైతే ఫుట్ డాక్టర్ లేక పాడియాట్రిస్ట్ వద్దకు వెళ్లి పాదాలను పరీక్ష చేయించుకోండి.

విలేకరుల సమావేశంలో డాక్టర్ జి.రోజా కిరణ్, డాక్టర్ వీరపినేని రవి కుమార్, డాక్టర్ ఆర్. రవి కుమార్, డాక్టర్ కె. రవి కుమార్, డాక్టర్ రఘునందన్, పాల్గొన్నారు.

ప్రభుత్వంలో అపరిష్కృత సమస్యలను తగ్గించడం, స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టితో ప్రత్యేక ప్రచారం- 2.0ను చేపట్టిన వ్యవసాయ పరిశోధన & విద్య విభాగం (డిఏఆర్ఇ)

న్యూఢిల్లీ, అక్టోబర్ 29: స్వచ్ఛత (పరిశుభ్రత), ప్రభుత్వంలో అపరిష్కృత అంశాలను తగ్గించాలన్న విషయంపై దృష్టితో 2 అక్టోబర్ నుంచి 31 అక్టోబర్, 2022 వరకు ప్రత్యేక ప్రచారం 2.0ను భారత ప్రభుత్వం ప్రకటించింది. ఇది సకాలంలో సూచనలను పరిష్కరించడం, ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రమైన కార్యస్థలం ప్రాముఖ్యతను బలపరుస్తుంది.

దేశంలోని కృషి విజ్ఞాన కేంద్రాలు (కెవికె)లు సూక్ష్మజీవుల ఆధారిత వ్యవసాయ వ్యర్థాల నిర్వహణ, వర్మి కంపోస్టింగ్ ప్రాముఖ్యతను ప్రదర్శించి, ప్రోత్సహించేందుకు 900 గ్రామాలను దత్తత తీసుకున్నాయి. వ్యవసాయ అవశేషాల సూక్ష్మజీవుల పృథక్కరణం, వ్యవసాయ అవశేషాలు, ఇతర సేంద్రీయ వ్యర్థాలను వర్మికంపోస్ట్ గా (వానపాముల ఎరువు) మార్చడానికి సంబంధించిన సాంకేతికతలను 22,678 మంది రైతులకు ప్రదర్శించారు. రైతులతో పాటుగా, 3,000మంది పాఠశాల విద్యార్థులకు వర్మికంపోస్టింగ్ పై అవగాహన కల్పించారు. పంట అవశేషాలను సరైన రీతిలో పృథక్కరణం చేసిన తర్వాత ఉపయోగించినప్పుడు, భూమి, మన్ను ఆరోగ్యం, పంట ఉత్పాదకతను మెరుగుపరచడంలో సేంద్రీయ ఎరువులు విలువైన ఇన్‌పుట్‌లుగా పని చేస్తాయి. అత్యధికంగా పంట అవశేషాలు సహజసిద్ధంగా కంపోస్టింగ్ ప్రక్రియకు లోనైనప్పుడు అవి దీర్ఘకాలం తీసుకునే కారణంగా, రైతులు వాటిని తగులబెట్టడాన్ని ఆశ్రయిస్తారు, ఫలితంగా విలువైన ఆస్తి వృధా కావడమే కాక పర్యావరణం కలుషితమవుతుంది. పియుఎస్ఎ డీకంపోసర్ వంటి సమర్థవంతమైన సూక్ష్మజీవుల డీకంపోసర్లను (పృథక్కరణానికి దోహదం చేసే) పచ్చి ఎరువుల సాంకేతికతలను పృథక్కరణ ప్రక్రియ వేగవంతం చేసిన ఫలితంగా తక్కువ వ్యవధిలో అధిక న్యాణత కలిగిన సేంద్రీయ ఎరువు లభిస్తుంది.

కాల్చిన బూడిద కాకుండా పృథక్కరణం చేసిన పచ్చి ఎరువుల అవశేషాలను ఉపయోగించడం వల్ల సేంద్రీయ కార్బన్, మొక్కలకు అత్యవసరమైన పోషకాలకు మట్టికి అంది, అందులో సూక్ష్మజీవుల కార్యకలాపాలను ప్రోత్సహిస్తాయి. పంట వ్యర్థాలు, అవశేషాలు, ఆవు పేడ, వంటింటి వ్యర్థాల వంటి ఇతర వ్యవసాయ వ్యర్థాలు పాక్షికంగా పృథక్కరణం చెందిన తర్వాత సమర్థవంతమైన వానపాముల జాతులను ఉపయోగించి, దానిని వెర్మికంపోస్ట్‌గా మార్చవచ్చు. వర్మికంపోస్ట్ మొక్కలకు అవసరమైన పోషకాలను సరఫరా చేసి, ప్రయోజనకరమైన మట్టిలోని సూక్ష్మజీవులను ప్రోత్సహించి, మట్టి ఆరోగ్యాన్ని మెరుగుపరిచి, తద్వారా మెరుగైన పంట ఉత్పాదకతను,స్థిరత్వాన్ని నిర్ధారించడంలో తోడ్పడుతుంది. ఉత్పత్తి చేసిన వర్మికంపోస్ట్ మిగులను అదనపు ఆదాయం వచ్చేందుకు మార్కెటింగ్ కూడా చేయవచ్చు.

ప్రత్యేక ప్రచారం 2.0 - హరితీకరణలో భాగంగా ఈ ఏడాది 1 లక్షకు పైగా మొక్కలు నాటిన పారదీప్ పోర్ట్ అథారిటీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 29: పరిశుభ్రమైన, హరిత (క్లీన్ అండ్ గ్రీన్) పారదీప్ కల సాకారం చేయడంలో ముందంజలో ఉండి పారాదీప్ పోర్ట్ అథారిటీ (పిపిఎ) తన ప్రయాణాన్ని కొనసాగిస్తోంది. ప్రస్తుతం నడుస్తున్న ప్రత్యేక ప్రచారం 2.0లో భాగంగా, పిపిఎ చైర్మన్ శ్రీ పి.ఎల్. హరనాథ్ జెబి/ జెసి వాటర్ ట్యాంక్ సమీపంలో ఎస్టీపికి టౌన్‌షిప్ మురుగునీటి కనెక్షన్‌ను ప్రారంభించారు.

ఎస్టీపీతో పోర్ట్ టౌన్‌షిప్ మురుగునీటి కాలువలను అనుసంధానించడం వల్ల, మురుగునీరు సమీపంలో ఉన్న చెరువుల వంటి సహజ ప్రవాహాలలోకి ప్రవహించదు, ఫలితంగా ఇటువంటి ప్రవాహాలను సున్నా స్థాయికి తీసుకురావాలన్న కల సాకారం అవుతుంది.

ప్రతి ఏడాదీ పచ్చదనాన్ని పెంపొందించేలా పారదీప్ పోర్ట్ అభివృద్ధి చెందుతున్న క్రమంలో ఈ ఏడాది నేటివరకు 1,07,000 మొక్కలను నాటడం జరిగింది. ఈ సందర్భంగా, శ్రీ హరనాథ్ ఇతర అధికారులతో కలిసి పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

కేటీఆర్ సాయం కోరిన పేద క్రీడాకారిణి..స్పందించిన మంత్రి

హైదరాబాద్, అక్టోబర్ 29:ఓ పేద క్రీడాకారిణికి అండగా నిలిచారు ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ . ట్విట్టర్లో తనను సాయం కోరిన ఓ పేద క్రీడాకారిణికి అండగా నిలిచారు. నల్గొండ జిల్లా చండూర్ మండలం బంగారి గడ్డ గ్రామానికి చెందిన అంతర్జాతీయ ఫెన్సింగ్ క్రీడాకారిణి నజియా ఆటలో రాణిస్తోంది. హకీంపేటలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ క్రీడా పాఠశాల హకీంపేట్ లో ఇంటర్ పూర్తి చేసిన 17 ఏళ్ల నజియా ఇటీవల లండన్ లో జరిగిన కామన్వెల్త్ ఫెన్సింగ్ చాంపియన్ షిప్ లో కాంస్య పతకం, టీమ్ విభాగంలో మరో కాంస్యం గెలిచింది. నజియా తండ్రి ఆర్టీసీ కండక్టర్ గా పని చేస్తున్నాడు. చిన్న జీతంతో ముగ్గురు పిల్లలను పోషించడం ఆయనకు కష్టం అవుతోంది. ఈ విషయాన్ని ట్విట్టర్ లో మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లిన నదియా తనకు ఆర్థిక సాయం చేయాలని కోరింది. దీనికి కేటీఆర్ స్పందించారు. మంత్రి ఆదేశాల మేరకు తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి, రాష్ట్ర ఫెన్సింగ్ సంఘం అధ్యక్షుడు మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నజియా ఇంటికి వెళ్లి స్పోర్ట్స్ కిట్ ను, రూ. 50 వేల నగదు అందించారు. దాంతో కేటీఆర్ పై ప్రశంసల జల్లు కురుస్తోంది. సోషల్ మీడియాలో నిత్యం యాక్టీవ్ గా ఉంటారు కేటీఆర్ ..సాయమడిగిన వారికి వెంటనే స్పందిస్తున్న తీరు అద్భుతమని కొనియాడుతున్నారు.

తెలంగాణలో నాలుగో రోజు కొనసాగుతున్న రాహుల్ పాదయాత్ర..

హైదరాబాద్, అక్టోబర్ 29:తెలంగాణలో రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర నాలుగో రోజు విజయవంతంగా కొనసాగుతున్నది. ఆయనతోపాటు కాంగ్రెస్ జిల్లా నేతలు, పార్టీ శ్రేణులు పాదయాత్రలో పాల్గొన్నారు. ఈరోజు మహబూబ్ నగర్ జిల్లాలోని ధర్మపురిలో పాదయాత్ర ప్రారంభమయింది. ఈ యాత్రలో రాహుల్ గాంధీతో సినీ నటి పూనం కౌర్ కూడా పాల్గొన్నారు. అనంతరంలో ఉస్మానియా విద్యార్థులతో రాహుల్ గాంధీ కలిసి పలు సమస్యలపై ముచ్చటించారు. విద్యార్థులు రాహుల్ తో కలిసి నడిచారు. ఈ సాయంత్రం జడ్చెర్లలో ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. నిన్న రాత్రి ఆయన ధర్మాపూర్ లో బస చేశారు.

మర్రి నర్సింహ రెడ్డి గారి చేతుల మీదగా సీఎం రిలీఫ్ ఫండ్

మేడ్చల్ అక్టోబర్ 29(నేటినిజం ప్రతినిధి): మేడ్చల్ పట్టణానికి చెందిన 17వ వార్డు మాజీ టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాయిత అంజనెలు బ/నీ కాయిత శంకర్ అనారోగ్యంతో దవాఖాన లో చికిత్స చేయించుకొని సీఎం రియఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకోగా, గౌరవ శ్రీ చామకూర మల్లారెడ్డి గారు రాష్ట్ర కార్మిక శాఖ మాత్యులు గారి సహకారంతో మంజూరైన రూ. 60,000.మల్కాజ్గిరి పార్లమెంట్ ఇన్చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి గారు మరియు మాజీ ఉప్పసర్పంచ్ మర్రి నర్సింహ రెడ్డి గారి చేతుల మీదగా సీఎం రిలీఫ్ ఫండ్ తిస్కోవటం జరగింది. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ రెడ్డి గారు మాట్లాడుతూ. సీఎం రియఫ్ ఫండ్ నుండి పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ కే వి జిల్లా అధ్యక్షులు ప్రభాకర్, శ్రీనివాస్, రాఫిక్, జంగీర్, మోనార్క్ మరియు టిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

తెలంగాణ ఎమ్మెల్యేలను కొంటూ బీజేపీ రెడ్ హ్యాండెడ్ గా దొరికిపోయింది : మనీష్ సిసోడియా

హైదరాబాద్, అక్టోబర్ 29:తెలంగాణలో టీఆర్ ఎస్ ఎమ్మెల్యేలను కొంటూ బీజేపీ రెడ్ హ్యాండడ్ గా దొరికిందని, బీజేపీ ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయడం సిగ్గుచేటని ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా అన్నారు. పదవులు, డబ్బులతో ఎమ్మెల్యేలను బీజేపీ ప్రలోభాలకు గురిచేస్తుందన్నారు. మీరు మా పార్టీలో చేరితే ఈడీ, సీబీఐలు మీ జోలికి రావంటు బీజేపీ చెబుతోందన్నారు. ఎమ్మెల్యేలను కొనడానికి వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తుందని, దేశంలో పెరిగిన ధరలతో పేద ప్రజలు ఇబ్బందులు పడుతుంటే బీజేపీకి పట్టదా అన్నారు. ఇంత డబ్బు బీజేపీకీ ఎక్కడి నుంచి వస్తుందన్నారు. ఢిల్లీలో మా ప్రభుత్వాన్ని కూడా కూల్చే ప్రయత్నం చేశారని, ఈ కొనుగోలు వ్యవహారం వెనకాల అమిత్ షా ఉండటం సిగ్గుచేటు అన్నారు.

ట్విట్టర్ ఇప్పుడు తెలివైన వ్యక్తి చేతుల్లో ఉంది : ట్రంప్

న్యూఢిల్లీ, అక్టోబర్ 29: ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ (ఇశ్రీనీని ఓబీబఎ) ట్విట్టర్‌ను (ఎలితిబిబివతీ) హస్తగతం చేసుకున్న విషయం తెలిసిందే. 44 బిలియన్ యూఎస్ డాలర్లతో ఈ మైక్రో బ్లాగింగ్ సైట్‌ను తన చేతుల్లోకి తీసుకున్నారు. దీనిపై అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ట్విట్టర్‌ను మస్క్ హస్తగతం చేసుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్' వేదికగా పోస్టు పెట్టారు.

'ట్విట్టర్ ఇప్పుడు తెలివైన వ్యక్తి చేతుల్లో ఉంది. దీంతోపాటు అమెరికాను ద్వేషించే ర్యాడికల్ లెఫ్ట్ ఉన్మాదుల నిర్వహణ నుంచి బయటకు వచ్చింది. ఈ విషయాలపై చాలా సంతోషంగా ఉంది. సంస్థను తీవ్రంగా దెబ్బతీసిన నకిలీ ఖాతాలు, ఇతరత్రా కార్యకలాపాలను వదిలించుకోవడానికి ట్విట్టర్ కృషి చేయాలి' అని పేర్కొన్నారు. అయితే, ఆయన ట్విట్టర్‌లోకి తిరిగి వస్తారో లేదో మాత్రం వెల్లడించలేదు. 2021 జనవరిలో అగ్రరాజ్యంలోని క్యాపిటల్ భవనంపై జరిగిన దాడి పరిణామాల నేపథ్యంలో ట్రంప్‌పై ట్విట్టర్ శాశ్వతంగా నిషేధం విధించిన విషయం తెలిసిందే.

యాదాద్రికి బంగారు పూత పనుల్లో వేగం.. చివరిదశలో కాపర్ మోల్డింగ్ పనులు

హైదరాబాద్, అక్టోబర్ 29:యాదాద్రి క్షేత్ర విమానగోపుర బంగారు తాపడం పనులు వేగం పుంజుకున్నాయి. సీఎం కేసీఆర్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన యాదాద్రి క్షేత్ర విమానగోపురానికి బంగారు తాపడం పూర్తి అయితే మరింత శోభిల్లనుంది. అనేక ప్రతిష్ఠాత్మక సంస్థలు బంగారు తాపడం పనుల్లో నిమగ్నమయ్యాయి. అయితే స్వర్ణ పూత పూసేముందు గోపురానికి రాగి మోల్డింగ్ చేయాల్సి ఉంది. ఈపనుల ప్రక్రియ దాదాపుగా 60 శాతం పూర్తి కావడంతో పసిడి పూత పనులపై అధికారులు దృష్టి సారించాయి. రాగి మోల్డింగ్ పనులు పూర్తి అయిన శిల్పాల పై పసిడి పూత పూసేందుకు సాంకేతిక నిపుణులు, స్థపతులు దృష్టి సారించారు.

రెండవ తిరుపతిగా ఖ్యాతి చెందిన యాదాద్రి పునర్ నిర్మాణ పనులను ముఖ్యంత్రి కేసీఆర్ అత్యంత ప్రతిష్ఠత్మకంగా పూర్తి చేశారు. 12వ శతాబ్దం నాటి ఈ స్వయం భూదేవాలయాన్ని కాకతీయుల నుంచి అనేక మంది రాజులు నిర్మాణాలు చేపట్టారు. 1323 కాకతీయ రాజ్యం పతనం అనంతరం అభివృద్ధి నిలిచిపోగా 1959 లో మొదటి సారిగా ఆనాటి పాలకులు తూర్పు రాజగోపురాన్ని నిర్మించారు. అయితే కాలగమనంలో భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం సీఎం కేసీఆర్ ఆలయాన్ని పునర్ నిర్మించారు. తిరుమాడ వీధులు, బాహ్య ప్రాకారాలు, తూర్పు, ఉత్తర, దక్షిణ, పడమర పంచతల రాజగోపురాలను నిర్మించారు. ఆలయ గర్భగుడిని అత్యంత సుందరంగా, ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసేలా నిర్మించారు. కాకతీయ, విజయనగర శిల్పరీతులతో 25లక్షల టన్నుల కృష్ణ శిలలతో ఈ నిర్మాణాలు జరిగాయి.

గతంలో ప్రాకారాలు లేని ఈ ఆలయానికి ప్రాకారాలతో పాటుగా క్షేత్ర విమానగోపురాన్ని అత్యంత సుందరంగా నిర్మించారు. అయితే వాస్తు రీతులకు భంగం కలగ కుండా నిత్యం 50 వేల మంది గంటల వ్యవధిలో దర్శనంచేసుకునే అవకాశాలను కల్పిస్తూ నిర్మించిన ఈ ఆలయానికి మరింత అందాన్ని పులుముతూ అనేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తొలుత క్షేత్ర విమాన గోపురానికి బంగారు పూత పూసి ఆతర్వాత మరిన్ని ప్రాకారాలకు తుదిమెరుగులు దిద్దాలని యాదాద్రి అభివృద్ధి అథారిటీ నిర్ణయించింది.

యాదాద్రి క్షేత్ర విమాన గోపురం బంగారు పూతకు 125 కిలోల బంగారం అవసరం అవుతుందని నిపుణులు అంచనా వేయగా ఇప్పటివరకు సుమారు 50 కిలోల బంగారం దాతలు విరాళం ఇచ్చారు. అలాగే అననేక మంది దాతలు గుప్త దానాలు చేయడంతో పాటుగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ తన మనుమడు హిమాన్ను రావు చేతుల మీదుగా ఒకకిలో 16 తులాల బంగారాన్ని యాదాద్రికి విరాళం ఇచ్చారు. ఇప్పటికే ప్రధానఆలయం గర్భగుడి ముఖద్వారం,కలశాలు, తోరణాలకు బంగారు పూత పూశారు. గర్భాలయం పసిడి కాంతులతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

అయితే విమాన గోపురానికి బంగారు తాపడం చేసేందుకు మద్రాసుకు చెందిన సంస్థలు టెండర్ ప్రక్రియ దక్కించుకుని పనులు ప్రారంభించాయి. తాపడానికి ముందు విమానగోపురాన్ని రాగి మోల్డింగ్ చేసే ప్రక్రియ ఉంటుంది. ఈ ప్రక్రియ ఇప్పటివరకు సుమారు70 శాతం పూర్తి అయినట్లు అధికారులు అంచనావేశారు. పూర్తి అయిన మోల్డింగ్ లో 56 శిల్పాలు, గోపురాకృతులు ఉన్నాయి.రాగి మోల్డింగ్ పూర్తికాగానే బంగారు పూత ప్రక్రియ ప్రారంభించి సంక్రాంతి వరకు పూర్తి చేయాలనే ఆలోచనల్లో అధికారులున్నారు.

రాష్ట్రానికి చెందిన పలువురు మంత్రులు, పారిశ్రామిక వేత్తలు ఇప్పటికే పసిడి పూత కోసం బంగారాన్ని విరాళంగా ఇచ్చారు. బంగారం బదులుగా నగదు విరాళాలు సంవృద్ధిగా వస్తున్నాయి. వీరితో పాటుగా పలువురు సీనీ ప్రముఖులు, పారిశ్రామిక వేత్తలు బంగారం లేదా నగదు రూపంలో విరాళాలు ఇస్తున్నారు. అయితే బంగారు తాపడం కోసం భక్తులు విరాళాలు ఇచ్చేందుకు యాదాద్రి అభివృద్ధి అథారిటీ ప్రత్యేక ఆన్ లైన్ క్యూఆర్ కోడ్ (క్విక్ రెస్పాన్స్ కోడ్) ను ప్రవేశపెట్టింది.ఫోన్ పే , గోగుల్ పే ద్వారా భక్తులు విరాళాలు ఇచ్చే అవకాశం కల్పించింది.

ఉదయ్‌పూర్‌లో అతిపెద్ద శివుడి విగ్రహం ఆవిష్కరణ.. విగ్రహం ప్రత్యేకతలు ఏంటంటే..

న్యూఢిల్లీ, అక్టోబర్ 29: రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో నిర్మించిన 369 అడుగుల శివుడి భారీ విగ్రహాన్ని ఇవ్వాల (శనివారం) ఆవిశ్కరించారు. ఉదయ్‌పూర్‌కు 45 కి.మి దూరంలో ఏర్పాటు చేసిన ఈ విగ్రహం ప్రపంచంలో అత్యంత ఎత్తయిన శివుడి విగ్రహంగా ఖ్యాతి పొందనుంది. తట్ పదమ్ సంస్థాన్ ఆధ్వర్యంలో శిల్పా చార్యుడు నిర్మించిన ఈ విగ్రహాన్ని ప్రఖ్యాత శిల్పాచార్యుడు మొరారి బాపు ప్రారంభించారు. ఈ ప్రారంభోత్వానికి ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్, స్పీకర్ సీపీ జోషి హాజరయ్యారు. ఇవ్వాల్టి నుండి నవంబర్ 6వ తేదీ వరకు వివిధ ఆధ్యాత్మిక, సాంస్కృతిక, మత కార్యక్రమాలు నిర్వహిస్తామని సంస్థాన్ ట్రస్టీ, మీరజ్ గ్రూప్ చైర్మన్ మదన్ పాలివాల్ తెలిపారు. ఈ రోజుల్లో శిల్పా చార్యుడు మొరారి బాపు రామకథను పారాయణం చేస్తారని తెలిపారు. శ్రీనాథ్‌జీలో ఏర్పాటు చేసిన ఈ విగ్రహం వల్ల ఆధ్యాత్మిక పర్యాటకం వృద్ధి చెందుతుందన్నారు.

కొండ శిఖరంపై 369 అడుగుల ఎత్తుతో నిర్మించిన ఈ విగ్రహాన్ని 20 కి.మి దూరం నుంచి చూడొచ్చు. ధ్యానముద్రలో ఉన్న ఈ విగ్రహాన్ని రాత్రిపూట కూడా స్పష్టంగా చూసేలా రంగురంగుల విద్యుద్దీపాలను అమర్చారు. ఈ విగ్రహం మూడంతస్తులు, ఒక హాల్, నాలుగు లిఫ్టులతో కూడి ఉంటుంది. 3వేల టన్నుల ఇనుము, 2.5 లక్షల క్యూబిక్ టన్నుల కాంక్రీట్, ఇసుక వాడారు. దీనిని పూర్తి చేయడానికి పదేళ్లు పట్టింది. 2012లో ముఖ్యమంత్రి గెహ్లోట్ దీనికి శంకుస్థాపన చేశారు. గంటకు 250 కి.మి వేగంతో వీచే గాలులను తట్టుకునేలా నిర్మించిన ఈ విగ్రహం 250 ఏళ్లపాటు చెక్కుచెదరని విధంగా నిర్మించామని శిల్పాచార్యుడు మొరారి తెలిపారు.

కశ్మీర్ లో 'ఆయుష్ ఉత్సవ్'ను ప్రారంభించిన శ్రీ శర్వానంద సోనోవాల్

న్యూఢిల్లీ, అక్టోబర్ 29: కేంద్ర రేవులు, నౌకాయాన, జలమార్గాలు, ఆయుష్ శాఖ మంత్రి శ్రీ శర్వానంద సోనోవాల్ ఈ రోజు కశ్మీర్ లోని గందర్బల్‌ప్రభుత్వ యునానీ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ (జి యు ఎమ్ సి)లో ఆయుష్ ఉత్సవ్ ను ప్రారంభించారు. ఆధునిక రోగి సంరక్షణకు అనుబంధంగా సంప్రదాయ వైద్య విధానాలను అందుబాటులోకి తేవడంపై ప్రభుత్వం దృష్టి సారించినందున 'ఆరోగ్య సంరక్షణలో అంతరాలను పూడ్చడం: ఆయుష్, ఒక ప్రామిసింగ్ రికోర్స్' అనే సెమినార్ ఆయుష్ ఉత్సవ్ ను కేంద్ర ఆయుష్ మంత్రి ప్రారంభించారు.

ఈ సదస్సు సందర్భంగా ఔషధ మూలికలు, విద్యార్థుల పోస్టర్లు, డైరెక్టరేట్ ఆఫ్ ఆయుష్ వీడియో డాక్యుమెంటరీని ప్రదర్శించారు. జమ్మూ కాశ్మీర్ లో ఆయుష్ వైద్య వ్యవస్థ సాధించిన విజయాలు, పురోగతిని వివరిస్తూ ఒక వీడియో డాక్యుమెంటరీని కూడా ప్రదర్శించారు.

ఈ సందర్భంగా శ్రీ సోనోవాల్ మాట్లాడుతూ, "మన సుసంపన్న మైన సంప్రదాయ ఔషధాల ప్రాముఖ్యాన్ని మానవ జీవితాల ప్ర యోజనాలకు, సుసంపన్నతకు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి. ప్రధాన మంత్రిశ్రీ నరేంద్ర మోదీ క్రియాశీల నాయకత్వంలో, ఆయుష్ ఔషధ వద్ధతులను ప్రోత్సహించడానికి , ప్రజల సంపూర్ణ ఆరోగ్యం, శ్రేయస్సు కోసం ఆధునిక ఔషధ చికిత్సలతో అనుబంధంగా అందించడానికి గట్టి ప్రయత్నం జరిగింది. మోదీ దార్శనికతను ముందుకు తీసుకెళ్తూ, గుజరాత్ లోని జామ్ నగర్ లో గ్లోబల్ సెంటర్ ఆఫ్ ట్రెడిషనల్ మెడిసిన్ ఏర్పాటు కానుండడం ఎంతో గర్వించదగ్గ విషయం. భారతదేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా సంప్రదాయ వైద్య విధానాలను మరింత బలోపేతం చేయడానికి ఇది ఒక అద్భుతమైన వార్త" అని అన్నారు.

ఈ ప్రాంతంలోని పర్యాటక రద్దీ కలిగిన సోన్ మార్గ్ లో అత్యవసర వైద్యసేవలనుప్రారంభించడం కోసం, మూడు రోజుల ఫస్ట్ ఎయిడ్/బిఎల్ఎస్ ట్రైనింగ్ వర్క్ షాప్ ను కేంద్ర మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా, గందర్బల్ సి ఎం ఓ ప్రథమ చికిత్స/బిఎల్ఎస్ శిక్షణ ప్రాముఖ్యత గురించి , సాధారణ ప్రజల ప్రయోజనాల కోసం అవుట్ రీచ్ నైపుణ్యాల ఆధారిత శిక్షణా కార్యక్రమాలలో కాశ్మీర్ లోని డైరెక్టర్ హెల్త్ సర్వీసెస్ సునిశిత దృష్టి గురించి మంత్రికి వివరించారు. డి హెచ్ ఎస్ కె బిఎల్ఎస్ మాస్టర్ ట్రైనర్ బిఎల్ఎస్ సిమ్యులేషన్ ఆధారిత వెథ్‌డాలజీపై భాగస్వాములకు వివరిస్తున్న బిఎల్ఎస్ మాడ్యూల్స్ గురించి మంత్రికి వివరించారు. ఈ రకమైన శిక్షణ మొదటి సారిగా సోన్ మార్గ్ లో నిర్వహిస్తున్నారు. ఎందుకంటే ఇది అన్ని వాతావరణ పరిస్థితుల అనుకూల పర్యాటక గమ్యస్థానంగా గుర్తింపు కలిగివుంది.

కేంద్ర మంత్రి ట్రౌట్ ఫిష్ ఫారం - హేమర్- ను కూడా సందర్శించారు . అలాగే, వ్యవసాయ క్షేత్రం మాదిరి ఉండే రేస్ వేస్, వృత్తాకార చెరువు, స్టాకింగ్ చెరువు, ఓవా హౌస్, ఇండోర్ పెంపకం హేచరీ, ట్రౌట్ ఫీడ్ మిల్లు, వినోద చేపల చెరువు వద్ద అందుబాటులో ఉన్న సదుపాయాలను , పరిశీలించారు. రెయిన్ బో ట్రౌట్ ఫిషింగ్ శిక్షణ, పరిశోధన, సప్లై ఫైయిన్ మేనేజ్ మెంట్ తో సహా కార్యకలాపాలపై వివరాలను మంత్రి ఆసక్తిగా తెలుసుకున్నారు. ప్రభుత్వం నుండి మద్దతు వ్యాపారంలో యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఏవిధంగా సహాయపడుతోందనే సమాచారం కూడా తెలుసుకున్నారు. పొలం పెంపకం సామర్థ్యం 0.25 లక్షలు , పొదిగే సామర్థ్యం నాలుగు లక్షలు అని మంత్రికి తెలియజేశారు.

శ్రీ సోనోవాల్ నేషనల్ ఫిష్ సీడ్ ఫామ్ మానస్ బల్ ను సందర్శించారు, అక్కడ చీఫ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ నేషనల్ ఫిష్ సీడ్ ఫార్మ్ ప్రాముఖ్యత గురించి , కల్చర్ , క్యాప్చర్ సెక్టార్ ల్లో చేపల పెంపకం విస్తరణ కు తీసుకున్న వివిధ కార్యకలాపాల గురించి మంత్రికి వివరించారు.

చేప విత్తన ఉత్పత్తి లో సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ, 2022-23 సంవత్సరంలో సుమారు 40.00 లక్షల కార్ప్ ఫిష్ ఫ్రై ఉత్పత్తి సాధించబడిందని, అందులో ఆక్వా-రాంచింగ్ కార్యక్రమం కింద సహజ జలవనరుల్లో గణనీయమైన సంఖ్యలో చేపల విత్తనాలను నిల్వ చేశామని, వివిధ ప్రైవేట్ , ప్రభుత్వ కార్ప్ ఫిష్ ఫార్మ్ లకు కూడా సరఫరా చేయబడిందని మంత్రికి తెలియజేశారు.

చేప విత్తనోత్పత్తి, చేపపిల్లల పెంపకం, తదనంతర అమ్మకాలతో పాటు కేంద్ర ప్రాయోజిత పథకాల పురోగతి, తక్కువ ఖర్చుతో కూడిన ఇల్లు, ఆటో రిక్షా, ఫిషింగ్ క్రాఫ్ట్ లు , గేర్లు , మత్స్యకారుల కమ్యూనిటీ అభ్యున్నతి కోసం అమలు జరుగుతున్న ఇతర సంక్షేమ పథకాల పురోగతి గురించి మంత్రికి వివరించారు. మనస్ బల్ లోని అత్యాధునిక ట్రౌట్ ఫీడ్ మిల్లు గురించి కూడా మంత్రికి వివరించారు, ఇది ప్రైవేట్ సెక్టార్ లో ట్రౌట్ ఫీడ్ డిమాండ్ ను, అలాగే యు టి జమ్మూ ,కాశ్మీర్ ,లడఖ్ అంతటా ప్రభుత్వ డిమాండ్ ను తీరుస్తుంది

మానస్బల్ పార్కును సందర్శించిన మంత్రి శ్రీ సోనోవాల్ , పార్క్ లోపల 'గ్రీన్ కాశ్మీర్' చొరవ కింద చేపట్టిన ప్లాంటేషన్ డ్రైవ్ ను ప్రారంభించారు. పి-4, బేసిక్ సీడ్ ఫామ్, సెంట్రల్ సిల్క్ బోర్డ్, మినిస్ట్రీ ఆఫ్ టెక్స్ టైల్స్, భారత ప్రభుత్వం, మానస్బల్, సఫ పోరాను కూడా మంత్రి సందర్శించారు.

డాక్టర్ రాజేష్ కుమార్, సీనియర్ సైంటిస్ట్/హెడ్, బయోబోల్టిన్ సిల్క్ ఆఫ్ కాశ్మీర్ గురించి , భారతదేశంలో ఈ స్టేషన్ ల ప్రాముఖ్యత గురించి మంత్రికి వివరించారు. భారతదేశంలో సమశీతోష్ణ బేసిక్ సిల్క్‌వార్మ్ సీడ్ అలాగే మల్బరీ టెంపరేట్ మల్బరీ జాతీయ ,అంతర్జాతీయ జెర్మ్‌ప్లాజమ్ బ్యాంక్‌ను నిర్వహించే ఏకైక స్టేషన్ ఇది. ఈ సందర్భంగా జిల్లాలోని సెరికల్చర్ రైతులతో మంత్రి ముచ్చటించారు.

అంతకుముందు, జమ్మూ అండ్ కాశ్మీర్ ఆయుష్ డైరెక్టర్ డాక్టర్ మోహన్ సింగ్ ఆయుష్ అభ్యాసాలను కేంద్రపాలిత ప్రాంతం అంతటా ఇంటి పేరుగా మార్చడానికి డిపార్ట్మెంట్ సాధించిన విజయాలను వివరించారు. ఆయుష్ హెల్త్ అండ్ వెల్ నెస్ సెంటర్లను ఏర్పాటు చేశామని, యోగాసనాల ద్వారా ఆరోగ్యాన్ని ప్రోత్సహించడానికి, వ్యాధుల నివారణకు అన్ని ఆయుష్ హెల్త్ అండ్ వెల్ నెస్ సెంటర్లలో యోగా బోధకులను నియమించినట్లు డాక్టర్ సింగ్ తెలిపారు.

32.50 కోట్ల వ్యయంతో జి యు ఎమ్ సి, గందర్‌బల్ ను జమ్మూ కాశ్మీర్ హౌసింగ్ బోర్డు నిర్మించింది. 2020-21 విద్యాసంవత్సరం నుంచి 60 సీట్లతో బ్యాచిలర్స్ ఇన్ యునాని మెడిసిన్ అండ్ సర్జరీ (బీయూఎంఎస్) కోర్సును ప్రారంభించడానికి ప్రభుత్వ యునానీ మెడికల్ కాలేజీ (జీయూఎంసీ), గందర్బల్ కశ్మీర్కు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

జమ్మూ కాశ్మీర్ హౌసింగ్ బోర్డు హౌసింగ్ బోర్డ్ 32.50 కోట్ల వ్యయంతో జి యు ఎం సి, గందర్‌బల్‌ను నిర్మించింది.ప్రభుత్వ యునాని మెడికల్ కాలేజ్ (జి యు ఎం సి) హాస్పిటల్, గందర్‌బల్ ,కాశ్మీర్‌కు 2020-21 అకడమిక్ సెషన్ నుండి 60 మంది ఇన్‌టేక్ కెపాసిటీతో మొదటి బ్యాచ్ ఆఫ్ బ్యాచిలర్స్ ఇన్ యునాని మెడిసిన్ అండ్ సర్జరీ (బి యు ఎం ఎస్) కోర్సును ప్రారంభించడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది.

ఫ్లోరైడ్‌తో నడుం వంగిన నల్లగొండ వెతలు తీర్చిన నేత కేసీఆర్ : కొప్పుల ఈశ్వర్

చౌటుప్పల్, అక్టోబర్ 29:ఫ్లోరైడ్ రక్కసితో నడుం వంగిన నల్లగొండ వెతలు తీర్చిన నేత సీఎం కేసీఆర్ అని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మునుగోడు నియోజకవర్గాన్ని ఫ్లోరోసిస్ రహిత ప్రాంతంగా తీర్చినందుకు హర్షం వ్యక్తం చేస్తూ చౌటుప్పల్‌లోని మిషన్ భగీరథ పైలాన్ వద్ద ఫ్లోరోసిస్ బాధితులు నిర్వహించిన కృతజ్ఞత సభకు మంత్రి ఈశ్వర్, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవారెడ్డి హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మునుగోడు గోడు విన్న నేత కేసీఆర్ అనీ, ఆయన పాలనలో ఫ్లోరోసిస్‌కు కాలం చెల్లిందన్నారు.

మునుగోడులో ఇంటింటికీ మిషన్ భగీరథ వచ్చిందని, కేసీఆర్ నాయకత్వమే మునుగోడుకు శ్రీరామ రక్ష అన్నారు. కేసీఆర్ వెంటే మునుగోడు జనమంతా ఉండాలన్నారు.

ఫ్లోరోసిస్ పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని మంత్రి బీజేపీ నేతలను నిలదీశారు. దొంగ హామీలు ఇచ్చిన బీజేపీ నేతల అడ్రస్ మునుగోడులో గల్లంతు చేద్దామని పిలుపునిచ్చారు. మర్రిగూడలో 300 పడకల దవాఖాన కట్టిస్తానన్న నడ్డా.. నీ అడ్రస్ ఎక్కడ? అని ప్రశ్నించారు. దొంగ హామీలు ఇచ్చే బీజేపీ దొంగ హామీలను నమ్మొద్దని, ఆ పార్టీ నేతల అవకాశవాద రాజకీయాలు మనుగోడులో చెల్లవన్నారు. మంచినీళ్లు ఇచ్చి ఆదుకున్న కేసీఆర్ సర్కారే ముద్దని, కాషాయ పార్టీకి మునుగోడులో చోటులేదన్నారు.

మిషన్ భగీరథ బతుకులు బాగు చేసిందని, మళ్లీ బతుకులను బీజేపీకి ఓటువేసి ఆగం చేసుకోవద్దన్నారు. దివాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ ఫ్లోరోసిస్‌తో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతుంటే ఆనాటి పాలకులు పట్టించుకోలేదని ఆరోపించారు.

మోసపూరిత హామీలు ఇచ్చి ఫ్లోరోసిస్ బాధితులను మోసం చేసిన బీజేపీ ప్రభుత్వం మునుగోడు ఉప ఎన్నికల్లో ఫ్లోరోసిస్ బాధితులను మళ్లీ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి కూనుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, నల్గొండ శ్రీను, రఘు, ఫ్లోరోసిస్ బాధితులు అంశాల స్వామి, అంజి, రాములు, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

మా మద్దతు టీఆర్ఎస్‌కే : మర్రిగూడ మున్నూరు కాపులు

మునుగోడు, అక్టోబర్ 29: మునుగోడు నియోజకవర్గ టీఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకర్ రెడ్డికి సబ్బండవర్ణాలు సంపూర్ణ మద్దతును తెలుపుతున్నాయి. శనివారం మునుగోడు నియోజకవర్గం మర్రిగూడ మున్నూరుకాపుల ఆత్మీయ సమ్మేళనం మండలంలోని రాంరెడ్డి పల్లి శివార్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దండు జగన్ తదితరుల సమక్షంలో సమేళానాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా సమ్మేళనంలో పాల్గొన్న మున్నూరు కాపు పెద్దలు, మహిళలు, యువకులు టీఆర్ఎస్ అభ్యర్థి ప్రభాకర్ రెడ్డికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ నినాదాలు చేశారు. గడిచిన ఎనిమిది సంవత్సరాలుగా ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయరంగానికి ఇచ్చిన ప్రాధాన్యతను రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర వివరించారు. ఉచిత కరెంట్, రైతు బంధు, రైతు బీమా, అందుబాటులో ఎరువులను ఉంచి వ్యవసాయాన్ని పండుగ చేశారని పేర్కొన్నారు .

ఈ సమ్మేళనంలో ఇబ్రహీం పట్నం మున్సిపల్ వైస్ చైర్మన్ యాదగిరి, మున్నూరుకాపు ప్రముఖులు సర్దార్ పుట్టం పురుషోత్తం, చల్లా హరిశంకర్, బండి సంజీవ్, విష్ణు జగతి, వాసుదేవుల వెంకటనర్సయ్య, రామస్వామి వెంకటేశ్వర్లు, వనమాల ప్రవీణ్,గుండ్లపల్లి శేషగిరిరావు, ఉప్పు సత్యనారాయణ, పర్వతం సతీష్, వాసాల వెంకటేష్, కోట్ల వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌లో 5 వేల మందితో మెగా 5ని రన్.. విశేష స్పందన వచ్చిందన్న సీపీ సత్యనారాయణ

కరీంనగర్, అక్టోబర్ 29 (నేటినిజం ప్రతినిధి): ఫ్లాగ్ డే (పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు) సందర్భాన్ని పురస్కరించుకుని కమిషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం కరీంనగర్ లో జరిగిన మెగా 5కే రన్ కు విశేష స్పందన లభించింది. అన్ని స్థాయిలకు చెందిన పోలీసులు, వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు, పోలీసు శిక్షణ సంస్థలకు చెందిన దాదాపు 5వేల మంది ఈ రన్ లో స్వచ్ఛందంగా పాల్గొన్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ ఈ 5కే రన్ ను జెండా ఊపి ప్రారంభించడంతో పాటు ప్రత్యక్షంగా పాల్గొన్నారు. మార్క్ ఫెడ్ గ్రౌండ్ నుండి ప్రారంభమై రాంనగర్ ? మంకమ్మ తోట ? గీత భవన్ చౌరస్తా ల మీదుగా పోలీస్ హెడ్ క్వార్టర్స్ కు చేరుకుంది.

ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ మాట్లాడుతూ ఫ్లాగ్ డే సందర్భాన్ని పురస్కరించుకుని పోలీసు శాఖ నిర్వహిస్తున్న వివిధ రకాల కార్యక్రమాల్లో అన్ని వర్గాలకు చెందిన ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొంటూ పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తుండడం ఆహ్వానించదగిన పరిణామన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాల్లో కరీంనగర్ రాష్ట్రంలో ముందంజలో కొనసాగుతున్నదని చెప్పారు. పోలీసు అమరవీరుల ఆశయాల సాధన కోసం అంకితభావంతో కృషి చేస్తున్నామని తెలిపారు. పోలీసు అమరవీరులు సమాజంలో శాంతి స్థాపన కోసం వారి ప్రాణాలను తృణప్రాయంగా అర్పించడం వల్లనే నేడు సమాజం శాంతియుతంగా వర్ధిల్లుతున్నదని పేర్కొన్నారు.

కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (పరిపాలన) జి చంద్రమోహన్, ఏసిపి లు తుల శ్రీనివాసరావు, కరుణాకర్ రావు, సి ప్రతాప్, ఎస్బిఐ జి వెంకటేశ్వర్లు, ఇన్స్పెక్టర్లు సిహెచ్ నటేష్, లక్ష్మీ బాబు, దామోదర్ రెడ్డి, రవీందర్, తిరుమల్ గౌడ్, ఆర్ఐ లు కిరణ్ కుమార్, రమేష్, మల్లేశం, జానీ మియా లతో పాటుగా ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, పోలీసు శిక్షణ సంస్థలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి నిరంజన్‌రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరిక

నల్గొండ, అక్టోబర్ 29: జిల్లాలోని మర్రిగూడెం మండలం శివన్నగూడెం గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు, పద్మశాలీలు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. రాపోలు యాదగిరి, బీజేపీ వార్డు మెంబర్లు బోయిని యాదయ్య, వాయిల్ల సోమయ్య , చిట్యాల రంగారెడ్డి, ముడిగె నర్సింహ, జిల్లగోని నర్సింహ, అబ్బనగోని నాగరాజు, మోర నర్సింహ, గణేష్ తదితరులకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అదేవిధంగా కమ్మగూడెంకు చెందిన బీజేపీ నాయకులు రమణ, నరేష్, కోటిరెడ్డి, ఇన్నయ్య పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పేదలకు వరంలా మారాయని తెలిపారు. మునుగోడులో టీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి గెలుపు ఖాయమని ధీమాను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, టీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ సిటీలో పెరుగుతున్న చలి.. రాత్రివేళ 15 డిగ్రీలకు పడిపోతున్న టెంపరేచర్లు

హైదరాబాద్, అక్టోబర్ 29: గ్రేటర్ పరిధిలో ఉష్ణోగ్రతలు తగ్గి.. చలి క్రమంగా పెరుగుతోంది. ఉష్ణోగ్రత గరిష్టంగా 30.4, రాత్రివేళ కనిష్టంగా 15.1 డిగ్రీల సెల్సియస్ నమోదు కావడంతో హైదరాబాద్? సిటీలో రోజు రోజుకు చలి తీవ్రమవుతోంది. మరోవైపు ఉదయం పూట సూర్యుడు సైతం కన్పించకపోవడంతో చలి ఎక్కువగా ఉంటోంది. దీంతో ఉదయం నడకకు వెళ్లే జనాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

గత వారం బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం బంగ్లాదేశ్ వైపుగా వెళ్లి టికోనా దీవి వద్ద తీరాన్ని దాటింది. దీంతో ఉత్తరాదిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. సిత్రంగ్ తుఫాను దక్షిణ రాష్ట్రాల్లో పెద్దగా ప్రభావం చూ

బీఆర్ఎస్‌తో ఉలిక్కిపడుతున్న బీజేపీ : టీఆర్ఎస్ ఎమ్మెల్సీలు రవీందర్‌రావు, సారయ్య

చండూరు, అక్టోబర్ 29:టీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ బీఆర్ఎస్ ఏర్పాటును చూసి బీజేపీ ఉలిక్కిపడుతుందని టీఆర్ఎస్ ఉమ్మడి నల్గొండ జిల్లా ఇన్‌చార్జి , ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు అన్నారు. చండూరులో ఆదివారం సీఎం కేసీఆర్ బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఎమ్మెల్సీ సారయ్యతో కలిసి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ మోడల్ దేశం యావత్తు కావాలని డిమాండ్లు వస్తుంటే బీజేపీ నాయకులకు నిద్రపట్టడం లేదని ఆరోపించారు.

కేసీఆర్ పాలనను అంతం చేసేందుకు ఎమ్మెల్యేల కొనుగోలు కుట్రలు చూస్తుంటే బీజేపీ వ్యవహారం జుగుప్సకరంగా ఉందని అన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు తప్పు అని తెలుసుకోకుండా బండి సంజయ్ యాదాద్రిపోయి నానా హంగామా చేసి అభాసు పాలయ్యాడని ఆరోపించారు.బీజేపీ భాగోతంపై వీడియోలు, ఆడియోలు బయటికి వస్తున్నాయని, వీటికి సంబంధించిన ఆధారాలు పక్కాగా ఉన్నాయని వెల్లడించారు.

అభివృద్ధిలో పోటిపడకుండా దొంగచాటుగా దెబ్బతీయాలని కుట్ర పన్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ సారయ్య మాట్లాడుతూ మునుగోడులో టీఆర్ఎస్ విజయం ఖాయమని అన్నారు. సీఎం సభ ట్రెండ్ సెట్టర్ అవుతుందని, సభకు అన్ని వర్గాల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తుందని వివరించారు.

సీఎం బహిరంగ సభకు ఏర్పాట్లు పూర్తి ..

ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ముఖ్యమంత్రి కేసీఆర్ చండూర్ మండలం బంగారి గడ్డ వద్ద సభ జరిగే భారీ బహిరంగ సభలో పాల్గొంటారని వారు తెలిపారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని వెల్లడించారు. పార్కింగ్ కోసం మండలాల వారీగా వేరు వేరుగా ఏర్పాట్లు చేశామని తెలిపారు.

ఓటమి పాలవుతామనే.. బీజేపీ చిల్లర ప్రయత్నాలు : జగదీశ్‌రెడ్డి

నల్గొండ, అక్టోబర్ 29 మునుగోడులో ఓటమిపాలవుతామనే అడ్డదారుల్లో బీజేపీ కుట్రలకు పాల్పడుతూ, చిల్లర ప్రయత్నాలు చేస్తోందని మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. కలెక్టరేట్‌లో ఈసీ ఉన్నతాధికారులను కలిసి శుక్రవారం తనకు జారీ చేసిన నోటీసుపై మంత్రి జగదీశ్‌రెడ్డి వివరణ ఇచ్చారు. టీఆర్ఎస్ అభ్యర్థికి ఓటు వేయకుంటే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని తాను మాట్లాడినట్లు ఈసీ అధికారులకు తప్పుడు ఫిర్యాదులు ఇచ్చారని, ఈసీ తనకు జారీ చేసిన నోటీసుపై సమాధానం ఇచ్చినట్లు మంత్రి పేర్కొన్నారు.

టీఆర్ఎస్ ప్రజా సంక్షేమం కోసం కట్టుబడిన పార్టీ అని చెప్పారు. బావులకాడ దగ్గర మోటార్లకు మీటర్లు పెట్టాలన్న బీజేపీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని మొదటి నుంచి చెబుతున్నామన్నారు. బావుల వద్ద మీటర్లు రాకుండా కేసీఆర్ అడ్డుకుంటారన్నారు. గత కొంతకాలంగా తెలంగాణ విద్యుత్ రంగాన్ని దెబ్బతీసే కుట్రలు బీజేపీ చేసిందని ఆరోపించారు. సంక్షేమ పథకాల అమలులో ఉన్నది ఉన్నట్లు చెబుతామన్నారు. గుజరాత్‌లో ఆరు గంటల విద్యుత్ మోటార్లకు మీటర్లు ఉన్నాయని, అక్కడ తెలంగాణ తరహాలో రైతుబంధు, రైతు బీమా, పెన్షన్లు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లేవన్నారు.

తాము అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు చెబుతామన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని కుట్రతోనే మునుగోడు ఉప ఎన్నికను బీజేపీ తీసుకొచ్చిందని ప్రజలకు చెబుతామన్నారు. బీజేపీ తప్పుడు ఫిర్యాదులకు, తాము భయపడమని స్పష్టం చేశారు. మునుగోడు ప్రజలకు చెప్పడానికి ఏమీ లేకనే బీజేపీ ఇలాంటి కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఏడు దశాబ్దాలు కాంగ్రెస్, బీజేపీ పెంచి పోషించిన ఫ్లోరైడ్ రక్కసిని ఎనిమిదేళ్లలోనే తరిమి కొట్టామన్నారు.

గత ప్రభుత్వ హయాంలో మునుగోడులో నాశనమైన వ్యవసాయ రంగాన్ని గాడిలో పెట్టామని, 24 గంటల ఉచిత విద్యుత్‌తో మునుగోడు వ్యవసాయం అద్భుతంగా మారిందని మంత్రి తెలిపారు. మునుగోడు ప్రజల ఆదాయం, స్థిరాస్తి విలువ పెరిగిందన్నారు. మునుగోడు ప్రజలు కేసీఆర్ వెంటే నడుస్తారని, బీజేపీకి ఓటమి భయం పట్టుకుందన్నారు. ఈసీ నోటీసుకు తాను ఇచ్చిన సమాధానం వారు సంతృప్తి చెందుతారని అనుకుంటానని మంత్రి తెలిపారు.

రాజకీయ గ్రూపుల మధ్య ఘర్షణ- కుర్చీలు విసురుకున్న వైనం

రాంచీ, అక్టోబర్ 29: ఛత్ పూజా కార్యక్రమం సందర్భంగా రెండు రాజకీయ గ్రూపుల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో టెంట్లు కూల్చి వేయడంతోపాటు ఒకరిపై ఒకరు కుర్చీలు విసురుకున్నారు. జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌లో ఈ సంఘటన జరిగింది. సిద్ధగోరాలోని సూర్య మందిరం వద్ద ఛత్ వేడుకల కోసం స్వతంత్ర ఎమ్మెల్యే సరయూ రాయ్, బీజేపీ నేత, జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి రఘుబర్ దాస్ మద్దతుదారులు పోటీ పడ్డారు. శుక్రవారం రాత్రి దాస్ వర్గం నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాల వేదిక సమీపంలో ఎమ్మెల్యే రాయ్ వర్గానికి చెందిన వారు భక్తుల కోసం టెంట్, కుర్చీలు ఏర్పాటు చేశారు.అయితే బీజేపీ నేత దాస్ మద్దతుదారులు దీనిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయ్ వర్గం ఏర్పాటు చేసిన టెంట్లను కూల్చి, కుర్చీలు విరగ్గొట్టారు. ఈ సందర్భంగా ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఒకరిపై ఒకరు కుర్చీలు విసురుకున్నారు. విరిగిన కుర్చీలతో కొట్టుకున్నారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.కాగా, 2019 అసెంబ్లీ ఎన్నికల ముందు బీజేపీని వీడిన సరయూ రాయ్, జంషెడ్‌పూర్ ఈస్ట్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. బీజేపీ మాజీ సీఎం రఘుబర్ దాస్‌ను ఎన్నికల్లో ఓడించారు.

మోటార్లకు మీటర్లు పెడుతామన్న బీజేపీకి బుద్ధి చెప్పాలి : మంత్రి పువ్వాడ

మునుగోడు, అక్టోబర్ 29: మోటార్లకు మీటర్లు బిగిస్తామన్న బీజేపీకి మునుగోడు ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం మునుగోడు మండలంలోని కొరటికల్, జోలం వారి గూడెంలో ఆయన సుడా చైర్మన్ బచ్చు విజయకుమార్‌తో కలిసి ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునుగోడు ఉప ఎన్నిక ఎందుకు వచ్చిందో ప్రజలందరికీ తెలుసునన్నారు. 24 గంటల ఉచిత కరెంటు కావాలంటే టీఆర్ఎస్‌కు ఓటు వేయాలని, 6 గంటల కరెంటు కావాలంటే బీజేపీకి ఓటు వేయాలన్నారు.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా రైతులకు ఉచిత కరెంటు ఇవ్వడం లేదని చెప్పారు. ఈ ఉప ఎన్నిక మోదీ, కేసీఆర్‌కు మధ్య నడుస్తుందన్నారు. బీజేపీ అభ్యర్థి రాజగోపాల్ రెడ్డి కూడా మోటార్లకి మీటర్ల పెడితే ఏ వంద్రత్రంద్‌ని మాట్లాడుతున్నాడన్నారు. మోదీ గత ఎన్నికల్లో నల్లధనం వెనక్కి తెచ్చి 15 లక్షలు అకౌంట్లలో వేస్తా అన్నాడనీ.. కానీ ఆ మాట ఇప్పటికీ నిలబెట్టుకోలేదని గుర్తు చేశారు. వంట గ్యాస్ ధరను రూ.400 నుంచి రూ.1200కు పెంచినందుకు మోదీకి ఓటు వేయాలా? అని ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్ రేట్లు విపరీతంగా బీజేపీ ప్రభుత్వం పెంచింది నిజం కాదా? అని ప్రశ్నించారు. ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థి కుసుకుంట్ల గెలిచిన రెండు నెలలో డబుల్ బెడ్ రూంలు ప్రారంభించి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు.

పని చేసే అభ్యర్థి గెలిపించండనీ, కారు గుర్తుకు ఓటేసి ప్రభాకర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో గడపగడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలంటే టీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు. ఎవరు ఎన్ని జిమ్మిక్కులు చేసినా నమ్మి మోసపోవద్దని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలతో కేసీఆర్‌కు దేశవ్యాప్తంగా ఆదరణను చూసి ఓర్వలేక.. మోదీ, అమిత్ షా తెలంగాణ ప్రభుత్వాన్ని అస్థిరపరిచే కుట్రకు తెరలేపారని అన్నారు. మోదీ, అమిత్ షా ఆటలు తెలంగాణలో సాగవని స్పష్టం చేశారు. అమ్ముడుపోయి మునుగోడు ఎన్నిక తెచ్చిన రాజ గోపాల్ రెడ్డిలా టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అమ్ముడుపోరని, వారు ఉద్యమకారులని, టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిఖార్సైన తెలంగాణ బిడ్డలన్నారు.

ఒక్కో ఎమ్మెల్యేకు రూ.100కోట్లు, కాంట్రాక్టులు ఇస్తామని ప్రలోభాలతో బీజేపీ కొనుగోలు కుట్రను తిప్పి కొట్టిన ఎమ్మెల్యేలను యావత్ తెలంగాణ ప్రజల పక్షాన అభినందించారు. బీజేపీ మోదీ, అమిత్ షాకు కేసీఆర్ భయం పట్టుకుందని, వారి ఢిల్లీ పీఠం కదులుతుందనే ఈ కుతంత్రాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అక్రమంగా సంపాదించిన సొమ్ముతో ఎమ్మెల్యేలను కొంటూ ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వాలను కూలదోస్తున్న బీజేపీకి తగినశాస్తి జరుగుతుందని హెచ్చరించారు. డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, టీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, ఖమ్మం కార్పొరేటర్ దండా జ్యోతి రెడ్డి, కూరాకుల వలరాజు, టీఆర్ఎస్‌వీ నాయకులు సిరిగమల్ల కిశోర్, కొరటికల్ సర్పంచ్ వల్లూరి పద్మ లింగయ్య, ఎంపీటీసీ మిర్యాల లక్ష్మమ్మ బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయండి: మంత్రి ఎర్రబెల్లి

చండూరు, అక్టోబర్ 29: మునుగోడు ఉప ఎన్నికల నేపథ్యంలో చండూరులో ఆదివారం జరగనున్న సీఎం కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పిలుపునిచ్చారు. ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, టీఎన్ఐఐడీసీ చైర్మన్ బాలమల్లు తదితరులతో కలిసి హెలీప్యాడ్ ప్రాంతాన్ని శనివారం సందర్శించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం కేసీఆర్ అనేక అద్భుత పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారని అన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను రెండు కళ్ళ లా చూస్తున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ వల్లే రాష్ట్రం సర్వతో ముఖాభివృద్ధి జరగడమే కాకుండా, అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచిందన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే మునుగోడు గెలుపునకు బాటలు వేస్తాయన్నారు.

తెలంగాణ అభివృద్ధి సీఎం కేసీఆర్ తోనే సాధ్యమని, అందుకే ఎక్కడికి వెళ్లినా, ఎవరిని కలిసినా టీఆర్ఎస్ కే తమ ఓటు అని చెప్పుతున్నారని వివరించారు. వారి నుంచి వస్తున్న పాజిటివ్ స్పందన చూస్తే టీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి గెలుపు ఖాయమని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ సభకు చండూరు మున్సిపాలిటీ తోపాటే, మునుగోడు నియోజకవర్గం మొత్తం నుంచి ప్రజలు వేలాదిగా తరలివచ్చే విధంగా చూడాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

ఏక లవ్య క్రీడా పోటీల నిర్వహణ ఏర్పాట్లపై అధికారులను ఆదేశించారు... కలెక్టర్ శశాంక

మహబూబాబాద్, అక్టోబర్ 29:(నేటినిజం ప్రతినిధి): జిల్లాలో నవంబర్ 1 నుండి 4వ తేదీ వరకు నిర్వహించబడుచున్న 1వ రాష్ట్ర స్థాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ క్రీడా పోటీలను నిర్వహించి ముందస్తు ఏర్పాట్లతో సమర్థ వంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.శశాంక అధికారులను ఆదేశించారు.

శనివారం సాయంత్రం కలెక్టర్ ఛాంబర్ లో సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో క్రీడా పోటీల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించి పలు ఆదేశాలు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏక లవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ మొదటి రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు మహబూబాబాద్ జిల్లా కురవి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ నుండే శ్రీకారం చుట్టడం జరిగిందని , క్రీడా పోటీలలో 22 ఈవెంట్/క్రీడలు నిర్వహించు కోనున్నామని, పోటీలలో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుండి 700 మంది బాలురు,

650 మంది బాలిక క్రీడాకారులు మన జిల్లాకు రానున్నారని, వీరితో పాటు కోచ్ లు, ప్రిన్సిపల్స్, ఇతర అధికారులు, ఉంటారని వీరందరికీ భోజన ,వసతి, రవాణా నదుపాయాలలో ఎటువంటి లోటుపాట్లు జరగకుండా ఏర్పాట్లు ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఆర్చరీ, అథెలటిక్స్, జూడో ,స్విమ్మింగ్ టేబుల్ టెన్నిస్, బాస్కెట్ బాల్, ఫుట్ బాల్, హ్యాండ్ బాల్, హాకీ, కబడ్డీ ,ఖో ఖో, వాలీబాల్ వంటి క్రీడలను ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ మొదటి రాష్ట్ర స్థాయి పోటీలలో నిర్వహించడం జరుగుతున్నదని, క్రీడల నిర్వహణకు అవసరమైన క్రీడా కోర్టులు, ఇతర ప్రాంతాల నుండి వచ్చే క్రీడాకారులకు అనుకూలంగా ఉండే విధంగా ఏర్పాటు చేయాలని, అదేవిధంగా ఈవెంట్/గేమ్ వారీగా క్రీడా పోటీల సక్రమ నిర్వహణకు గాను బాధ్యులను, వాలంటీర్లను నియమించాలని కలెక్టర్ సూచించారు.

ముఖ్యంగా భోజన , వసతి, సదుపాయాల్లో రాజీ పడకూడదని, ఎటు వంటి లోటుపాట్లు లేకుండా పూర్తి ఏర్పాట్లు ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.

దీంతోపాటు విద్యుత్ సరఫరా, పరిశుభ్రత, మరుగుదొడ్లు, త్రాగునీటి సౌకర్యం ఏర్పాట్లు నిరంతరం ఉండాలని ,అదే విధంగా క్రీడా ప్రాంగణంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి నిరంతరం వైద్యులు అందుబాటులో ఉండాలని కలెక్టర్ సూచించారు.

క్రీడల నిర్వహణ సజావుగా జరిగేందుకు ఏర్పాటైన వివిధ కమిటీలు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ సూచించారు.

క్రీడా పోటీల నిర్వహణ ఏర్పాట్లన్నీ ఆదివారం సాయంత్రంలోగా పూర్తి కావాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

మహబూబాబాద్ రీజనల్ కోఆర్డినేటర్ ఏ.వి.రాజ్య లక్ష్మి, డి.టి.డి.ఓ ఎర్రయ్య, జిల్లా యువజన క్రీడల అధికారి అనిల్, జిల్లా విద్యాశాఖ అధికారి మొహమ్మద్ అబ్దుల్ హై, కురవి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపల్ వి. సరిత, ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ అధికారులు, కురవి తహసిల్దార్ ఎంపీడీవో , తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ఢీకొన్న పశువు : స్వల్పంగా దెబ్బతిన్న ఫ్రంట్ కోచ్

ముంబై, అక్టోబర్ 29: వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు మరో ప్రమాదం ఎదురైంది. ముంబై సెంట్రల్ నుంచి గాంధీనగర్ వెళుతున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ శనివారం ఉదయం 8.17 గంటలకు అతుల్ సమీపంలో పశువును ఢీకొంది. ట్రాక్‌పై పశువు ఢీకొనడంతో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ముందు భాగంలో డ్రైవర్ కోచ్ స్వల్పంగా దెబ్బతిందని అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటనతో ట్రైన్ 15 నిమిషాల పాటు నిలిచిపోయింది.

ముంబై సెంట్రల్ డివిజన్‌లో అతుల్ ప్రాంతంలో వందేభారత్ ట్రైన్‌ను పశువు ఢీకొనడంతో రైలును 15 నిమిషాల పాటు నిలిపివేశారని రైల్వేలు ఓ ప్రకటనలో పేర్కొన్నాయి. ఫ్రంట్ కోచ్ స్వల్పంగా దెబ్బతినడం మినహా రైలుకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని తెలిపింది.

కాగా గడిచిన కొద్దివారాల్లో వందే భారత్ ట్రైన్‌లో ఇలాంటి ఘటన జరగడం ఇది నాలుగోసారి కావడం గమనార్హం. న్యూఢిల్లీ-వారణాసి రూట్‌లో ఇటీవల వందే భారత్ ట్రైన్ ట్రాక్షన్ మోటార్‌లో సాంకేతిక సమస్యలు ఎదురవగా అంతకుముందు ముంబై-గాంధీనగర్ రూట్‌లో ట్రైన్‌ను పశువులు ఢీకొన్న ఘటనలు వరసగా రెండు రోజుల పాటు జరిగాయి.

మూడపల్లి అంగన్వాడీ కేంద్రంలో దీపావళి వేడుకలు..

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 29: (నేటినిజం ప్రతినిధి): చందుర్తి మండలం మూడపల్లి గ్రామంలో 2వ అంగన్వాడి కేంద్రంలో శనివారం దీపావళి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా దీపాలను వెలిగించి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ నిర్మలాదేవి మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల్లో దీపావళి సందర్భంగా కార్తీక మాసం వరకు ఉత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి ఉపాధ్యాయులు పద్మ. రాధిక పిల్లల తల్లులు పాల్గొన్నారు,

ఈడీ అధికారులపై సుప్రీంకోర్టు ఆగ్రహం.. ఓ కేసులో టైమ్ వేస్ట్ చేశారని అధికారికి రూ.లక్ష ఫైన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 29: విలువైన కోర్టు టైమ్‌ని వేస్ట్ చేశారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పై సుప్రీంకోర్టు ఇవ్వాల (శనివారం) ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనికి తోడు స్టేషనరీ, లీగల్ ఫీజులు కూడా వృథా అయ్యాయని విచారం వెలిబుచ్చింది. పిటిషన్ దాఖలు చేసిన ఈడీ అధికారికి రూ.లక్ష జరిమానా విధించింది. అతడి జీతం నుంచి రికవరీ చేయాలని అధికారులను కోర్టు ఆదేశించింది. కేన్సర్‌తో బాధపడుతున్న ఓ నిందితుడికి బెయిల్ రద్దు చేయాలని కోరుతూ ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌ను శనివారం సుప్రీంకోర్టు విచారించి ఈ మేరకు ఈడీపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

కేన్సర్ బాధితుడిగా ఉన్న నిందితుడు ఓ ప్రైవేట్ బ్యాంకులో పనిచేస్తున్నాడు. దాదాపు రూ. 24 కోట్ల మేర మోసం చేసినట్లు ఆయనపై ఆరోపణలు రావడంతో ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. గత ఏడాది నవంబర్ 12న అలహాబాద్ హైకోర్టుకు పిటిషన్ రాగా.. ఆయన చికిత్స తీసుకున్న కమలా నెహ్రూ దవాఖాన హెల్త్ రిపోర్ట్ ఆధారంగా హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. దాంతో హైకోర్టు నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఈడీ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ ఎంఎం సుందరేష్‌తో కూడిన ధర్మాసనం ఈ కేసులో విచారణలు చేపట్టింది. పరిస్థితులను బట్టి నిందితుడు కేన్సర్‌తో బాధపడుతున్నందున సుప్రీంకోర్టు జోక్యం అవసరం లేదని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. ఇలాంటి పిటిషన్లు దాఖలు చేసి సుప్రీంకోర్టు విలువైన సమయాన్ని వృథా చేశారని ఈడీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ పిటిషన్ వేసిన ఈడీ అధికారికి రూ.లక్ష జరిమానా విధిస్తున్నట్లు తీర్పు వెల్లడించింది ధర్మాసనం.

ఈ ఫైన్ మొత్తాన్ని నెల రోజుల్లోగా సుప్రీం కోర్టు రిజిస్ట్రీలో డిపాజిట్ చేయాలని ధర్మాసనం ఆదేశించింది. ఈ జరిమానాలో సగం మొత్తం నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీకి అందజేయనున్నట్లు కోర్టు పేర్కొన్నది. మిగిలిన మొత్తాన్ని సుప్రీంకోర్టు ఆర్బిట్రేషన్ అండ్ కన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీకి అందజేయనున్నారు.

పరీక్ష నుంచి తప్పించుకోవడానికి విద్యార్థి ఏం చేశాడంటే

చెన్నై: పరీక్ష నుంచి తప్పించుకునేందుకు ఒక విద్యార్థి తుంటరి పని చేశాడు. ఏకంగా కిడ్నాప్ డ్రామా ఆడాడు. స్కూల్‌కు వెళ్లని ఆ బాలుడు, తనను కిడ్నాప్ చేయగా తప్పించుకున్నట్లు అందరినీ నమ్మించాడు. అయితే పోలీసుల దర్యాప్తులో అసలు విషయం బయటపడింది. తమిళనాడు రాజధాని చెన్నైలో ఈ సంఘటన జరిగింది. కిల్పాక్‌లోని స్కూల్‌కు చెందిన 12 ఏళ్ల విద్యార్థి పరీక్షలు రాయనని తల్లిదండ్రులకు చెప్పాడు. వారు ఒప్పుకోకపోవడంతో పరీక్షల నుంచి తప్పించుకునేందుకు ఒక ప్లాన్ వేశాడు. ఈ నెల 26న స్కూల్ వద్ద ఒక ఆటో డ్రైవర్ తనను కిడ్నాప్ చేసినట్లు ఆరోపించాడు. పచ్చయ్యప్ప కాలేజీ మెట్రో స్టేషన్ సిగ్నల్ వద్ద ఆటో ఆగడంతో తప్పించుకుని మెట్రో స్టేషన్‌లోకి వెళ్లినట్లు ఒకరి ఫోన్ నుంచి తల్లిదండ్రులకు, అక్కడున్న పోలీసులకు చెప్పాడు. దీంతో పోలీసులు ఆ బాలుడ్ని సెంట్రల్ రైల్వే స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం అతడి తల్లిదండ్రులకు అప్పగించారు.కాగా, ఆ విద్యార్థి కిడ్నాప్‌పై పోలీసులు దర్యాప్తు జరిపారు. ఆ స్కూల్ పరిధిలోని సీసీటీవీల ఫుటేజ్‌ను పరిశీలించారు. అయితే ఎక్కడా కూడా ఆ బాలుడు కిడ్నాప్ అయిన దాఖలాలు కనిపించలేదు. మరోవైపు ఆ రోజున స్కూల్ ఎగ్గొట్టిన ఆ బాలుడు బస్సులో పచ్చయ్యప్ప కళాశాల మెట్రో స్టేషన్ వద్దకు చేరుకున్నాడు. అనంతరం మెట్రో స్టేషన్‌లోకి వెళ్లి అక్కడి పోలీసులను కలిశాడు. ఆటో డ్రైవర్ తనను కిడ్నాప్ చేయగా సిగ్నల్ వద్ద తప్పించుకుని మెట్రో స్టేషన్‌లోకి వచ్చినట్లు చెప్పాడు.మెట్రో స్టేషన్ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్ ద్వారా పోలీసులకు ఈ విషయం తెలిసింది. దీంతో మరునాడు ఆ బాలుడ్ని నిలదీయగా కిడ్నాప్ డ్రామా గురించి చెప్పాడు. ఈ నేపథ్యంలో పోలీసులు ఆ విద్యార్థిని హెచ్చరించి వదిలేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణి చేసిన ఎంపిపి ఈదురు రాజేశ్వరి.

మహబూబాబాద్, అక్టోబర్ 29:(నేటినిజం ప్రతినిధి): పేద ప్రజల సంక్షేమమే సీఎం కేసిఆర్ లక్ష్యమని పెద్దవంగర ఎంపిపి ఈదురు రాజేశ్వరి అన్నారు.

ఎర్రబెల్లి దయాకర్ రావు రాష్ట్ర పంచాయతి రాజ్ శాఖ మంత్రి తన నియోజకవర్గంలో పేద ప్రజలను కాపాడుకోవాలని బాధ్యతతో పేద ప్రజలు కార్పొరేట్ హాస్పిటల్లో వైద్యం చేయించుకున్నవారికి సీఎం రిలీఫ్ ఫండ్ నిధుల నుండి చిట్యాల గ్రామానికి చెందిన కట్కారి సోమలింగంకు 60000 రూపాయలు, గుంటుక పద్మ కు 40000 రూపాయలు, లలిత కు 225000 రూపాయల చెక్కులను పంపిణి చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో తెరాస మండల పార్టీ అధ్యక్షులు ఈదురు ఐలయ్య, గ్రామ తెరాస పార్టీ ఉపాధ్యక్షులు మొగులగాని హరీష్, ప్రధాన కార్యదర్శి వల్లపు పరమేష్, నాయకులు రాపోలు సుదర్శన్, ఈదురు సోమయ్య, కొయ్యేడి యాకయ్య, ఈదురు వెంకటయ్య, ఈదురు రాములు, ఎల్తూరి మహేష్, రాపోలు దేవేందర్, తోట చందర్, తన్నీరు మధు, రాపోలు సోమనర్సయ్య, గుంటుక వెంకట సోములు, పాక యాకయ్య, దాసరి ముత్తయ్య, చిప్పల స్వామి, కార్పటి వెంకన్న, తోట స్వాతి, కొంతం రేణుక, ఆవుల పుల్లయ్య, ఈదురు వెంకన్న, ఎల్తూరి యాకయ్య,ధరవత్ కొబ్లా, మహిళాలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అరసం కథా స్రవంతి
10 కథా సంపుటాల ఆవిష్కరణ

1. కనుపర్తి వరలక్ష్మమ్మ కథలు
2. తాళ్లూరు నాగేశ్వరరావు కథలు
3. శశిశ్రీ కథలు
4. శాంతి నారాయణ కథలు
5. పెద్దింటి అశోక్‌కుమార్ కథలు
6. బలివాడ కాంతారావు కథలు
7. సతీష్ చందర్ కథలు
8. కరుణకుమార కథలు
9. వి.ఆర్.రాసాని కథలు
10. సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి కథలు

పది పుస్తకాల సెట్ ధర రూ. 670/-
ఆవిష్కరణ సందర్భంగా సెట్ రూ. 550/- మాత్రమే

తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం మరియు
తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంయుక్త ఆధ్వర్యంలో

కథా స్రవంతి సంపుటాల ఆవిష్కరణ సభ

సభాధ్యక్షులు : డా॥ రాపోలు సుదర్శన్
ప్రధాన కార్యదర్శి, తెలంగాణ అరసం
ముఖ్య అతిథి & ఆవిష్కర్త : ఆచార్య ఎస్వీ సత్యనారాయణ
పూర్వ ఉపాధ్యక్షులు, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
గౌరవ అతిథి : శ్రీ జూలూరు గౌరీశంకర్
అధ్యక్షులు, తెలంగాణ సాహిత్య అకాడమీ
విశిష్ట అతిథి : డా॥ ఏనుగు నరసింహారెడ్డి
అదనపు కలెక్టర్, మేడ్చల్ జిల్లా
ఆత్మీయ అతిథులు : డా॥ మామిడి హరికృష్ణ
సంచాలకులు, తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ
పుస్తకాల పరిచయం : శ్రీ కె.పి.అశోక్ కుమార్, ప్రముఖ విమర్శకులు
ప్రత్యేక అతిథులు : శ్రీ స

నిరుపేద కుటుంబానికి మిలినియం ఫౌండేషన్ ఆర్థిక సహాయం

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 29: (నేటినిజం ప్రతినిధి): బైక్ ప్రమాదంలో పాదంకు తీవ్ర గాయమైన పోశెట్టిపల్లి గ్రామానికి చెందిన చింతపంటి సాయికి శస్త్రచికిత్స చేయించుకోవడానికి ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఫౌండేషన్ ను సహాయం చేయాలని సంప్రదించగా చలించిన వేములవాడ మిలీనియం ఫౌండేషన్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 10,000/- లు ఆర్థిక సహాయం శనివారం సాయి సోదరుడు రాజుకు చెక్కును అందించడం జరిగింది. కమిటీ సభ్యులు మాట్లాడుతూ సాయి కుటుంబ సభ్యులు మిలీనియం ఫౌండేషన్ కు సమాచారం అందించగా కమిటీ సభ్యులం చర్చించుకుని మిత్రుల సహకారంతో ఈ సహాయాన్ని అందించామన్నారు. సాయి త్వరగా కోలుకుని ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సంతోషంగా జీవించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అలాగే అతని సోదరుడు, బంధువులు మాట్లాడుతూ మానవతా దృక్పదంతో ఈ సహాయం చేసిన వేములవాడ మిలీనియం ఫౌండేషన్ కు ప్రత్యేక కృతజ్ఞతతో పాటు వారికి ఎంతో రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, విజయ్, వినయ్, కృష్ణ. అశ్విన్, అంజి, అజయ్, కరుణ్, ప్రశాంత్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

2022-23 విద్యా సంవత్సరానికి ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాల దరఖాస్తు ప్రక్రియ వేగవంతం చేయడం

మెదక్, అక్టోబర్ 29: నేటినిజం ప్రతినిధి):2022-23 విద్యా సంవత్సరానికి ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాల దరఖాస్తు ప్రక్రియ వేగవంతం చేయవలసినదిగా అదనపు కలెక్టర్ రమేష్ ఆదేశించారు. శనివారం జిల్లాలోని అని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ లో మాట్లాడుతూ గత సంవత్సరం ఉపకార వేతనాలకై దరఖాస్తు చేసుకున్న 4,678 మంది ఎస్సి విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించామన్నారు. ప్రస్తుత సంవత్సరానికి అట్టి దరఖాస్తులు రెన్యూవల్ చేయవలసి ఉండగా ఇప్పటి వరకు కేవలం 1,586 మాత్రమే రిప్టర్ చేశారని, మిగిలిన 3,092 దరఖాస్తులను రెండు రోజులల్లో పూర్తి చేయవలసినదిగా ఆదేశించారు. ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాలకు సంబంధించి ఏవైనా సందేహాలు లేదా ఇతర సాంకేతిక సమస్యలుంటే వెంటనే జిల్లా ఎస్సి అభివృద్ధి అధికారిని సంప్రదించవలసినదిగా అదనపు కలెక్టర్ రమేష్ ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే 5 నుండి 10వ తరగతి విద్యార్థులు అర్హులని ఆయన తెలిపారు. 5 నుండి 8 తరగతి వర్కో బాలురకు ఒక వేయి, బాలికలకు 1500 రూపాయలు, అదేవిధంగా 9,10 వ తరగతి బాలబాలికలకు 3 వేళా రూపాయల చొప్పున ఉతికార వేతనం లభించునని రమేష్ అన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో ఎస్సీ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, డీఈఓ రమేష్ కుమార్, మండల్ విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

గోల్డెన్ ఇయర్ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై సీనియర్ సిటిజన్లకు వడ్డీరేటు పెంపు

న్యూఢిల్లీ, అక్టోబర్ 29: జీనిఎ ఈతిలేవట ఆతిజూనీబతిబిబ । సీనియర్ సిటిజన్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ప్రముఖ ప్రైవేట్ బ్యాంక్.. ఐసీఐసీఐ బ్యాంక్ ఆకర్షణీయ వడ్డీరేట్లు ఆఫర్ చేస్తున్నది. తాజాగా మరో 10 బేసిక్ పాయింట్లు వడ్డీ పెంచేసింది. ఐసీఐసీఐ బ్యాంక్ గోల్డెన్ ఇయర్స్ ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకంలో ఇన్వెస్ట్ చేసిన సీనియర్ సిటిజన్లకు ఇప్పటికే అదనంగా అందిస్తున్న 0.50 శాతం వడ్డీకి తోడు అదనంగా 0.20 శాతం వడ్డీ అందిస్తున్నది. ఇంతకుముందు గోల్డెన్ ఇయర్స్ ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకం ఇన్వెస్ట్‌మెంట్లకు 0.10 శాతం అదనంగా వడ్డీ కల్పించింది. ఐదేండ్ల నుంచి పదేండ్ల లోపు రూ.2 కోట్ల లోపు ఫిక్స్‌డ్ డిపాజిట్లకు ఈ స్పెషల్ వడ్డీరేట్లు వర్తిస్తాయి. ఈ స్పెషల్ ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాన్ని ఈ నెల 31 నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ ఏడో తేదీ వరకు పొడిగించింది.

తాజా వడ్డీరేట్ల సవరణతో గోల్డెన్ ఇయర్స్ ఫిక్స్‌డ్ డిపాజిట్ స్కీమ్‌పై సీనియర్ సిటిజన్లు 6.95 శాతం వడ్డీ పొందుతారు. పెంచిన వడ్డీరేట్లు తక్షణం (2022 అక్టోబర్ 29) అమల్లోకి వస్తాయి. ఫ్రెష్ ఫిక్స్‌డ్ డిపాజిట్లతోపాటు రెన్యూవల్ చేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్లకు కూడా సవరించిన వడ్డీరేట్లు అమలవుతాయి. ఈ పథకం కింద మదుపు చేసిన సొమ్ము మెచ్యూరిటీ గడువుకు ముందు విత్‌డ్రాయల్ ఆప్షన్ లభిస్తుంది. 2020 మే నెలలో ఐసీఐసీఐ బ్యాంక్ గోల్డెన్ ఇయర్స్ ఫిక్స్‌డ్ డిపాజిట్ ప్రారంభించింది. నాటి నుంచి పలు దఫాలుగా ఈ స్కీమ్‌ను పొడిగిస్తూ వచ్చింది.

ఎంపిక చేసిన టెన్యూర్‌ల ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఐసీఐసీఐ బ్యాంక్ 50 బేసిక్ పాయింట్లవడ్డీరేట్లు పెంచేసింది. సవరించిన వడ్డీరేట్లు శనివారం (2022 అక్టోబర్ 29) నుంచి అమల్లోకి వస్తాయి. ఐసీఐసీఐ బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీరేట్లు సవరించడం ఈ నెలలో రెండోసారి. గత మే నెలలో ఆర్బీఐ రెపోరేట్ పెంచినప్పటి నుంచి బ్యాంకులు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై పలు దఫాలుగా వడ్డీరేట్లు సవరించాయి. ఎస్బీఐతోపాటు హెచ్డీఎఫ్సీ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్బీ), యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ గత కొన్ని నెలలుగా వరుసగా ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీరేట్లు సవరించాయి.

బెజవాడ పటాకుల పేలుడు ఘటనలో నలుగురు అరెస్టు..

అమరావతి: అక్టోబర్ 29:బాణసంచా పేలుడులో ఇద్దరు సజీవ దహనం ఘటనకు సంబంధించి నిజానిజాలను పోలీసులు నిగ్గుతేల్చారు. కాలం చెల్లిన పాత మందుగుండు సామాగ్రి బ్లాస్ట్ కావడంతో భారీ ప్రమాదం సంభవించిందని, నిర్వహకులు భారీగా అనుమతి లేని బాణాసంచాను దిగుమతి చేసుకుంటున్న క్రమంలో పీడనం వల్ల పేలుడు ఏర్పడిందని అధికారులు స్పష్టం చేశారు. ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైన అంశాల మేరకు ఇద్దరు షాపు యజమానులతోపాటు అక్రమంగా మందుగుండు సామాగ్రి సరఫరా చేసిన మరో ఇద్దరిని అరెస్టు చేశారు. లైసెన్స్ పొందిన బాణాసంచా తోపాటు స్వంత తయారీ దేశీయ ఉత్పత్తులను విక్రయించే ప్రయత్నం చేశారని నిందితులపై ప్రధాన ఆరోపణ.

దీపావళి పండుగ ముందురోజు ఈనెల 23వ తేదీన విజయవాడలోని జింఖానా గ్రౌండులో ఏర్పాటు చేసిన బాణాసంచా విక్రయాలు షాపుల్లో భారీ అగ్ని ప్రమాదం సంభవించి ఇద్దరు వ్యక్తులు స జీవంగా దహనమైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై సత్యనారాయణపురం పోలీసులు స్టేషన్ నందు -కై-మ్ నెంబర్ 586/2022 సెక్షన్ 285 , 304 పార్ట్ 2, సెక్షన్ 3 అండ్ 5 ఆఫ్ ఎక్స్‌ప్లోజివ్ సబ్‌స్టన్స్ యాక్ట్ 1908 అండ్ సెక్షన్ 9 (బి))(1)(ఏ)(బి) ఆఫ్ ఎక్స్‌ప్లోజివ్ యాక్టు 1884 ప్రకారం కేసులు నమోదు చేసినట్లు శు క్రవారం జరిగిన విలేఖరుల సమావేశంలో డీసీపీ కొల్లి శ్రీనివాసరావు తెలిపారు.

అమెరికాలోని ఓ ఇంట్లో అగ్నిప్రమాదం, 8 మంది దుర్మరణం

న్యూఢిల్లీ, అక్టోబర్ 29: అమెరికా ఓక్లహోమాలోని ఓ ఇంట్లో జరిగిన అగ్నిప్రమాదంలో ఎనిమిది మంది దుర్మరణం పాలయ్యారు. మృతుల్లో 1 నుంచి 13 ఏండ్ల మధ్య వయసున్న ఆరుగురు చిన్నారులు ఉన్నారు. బ్రోకెన్ యారో పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయంత్రం 4 గంటలకు మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేసినా.. ఇంట్లోని వారి ప్రాణాలను కాపాడలేకపోయారు.

అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఆత్మహత్య లేదా హత్య చేసుకునే ఆవకాశాలను కూడా కొట్టిపారేయలేమని బ్రోకెన్ యారో ఫైర్ చీఫ్ జెరేమీ మూర్ చెప్పారు. ఇంటి వెనుక భాగంలో ఉన్న గదిలో మంటలు చెలరేగి ఇంటికి వ్యాపించినట్లుగా భావిస్తున్నారు. మెడికల్ రిపోర్టు వచ్చిన తర్వాతే ప్రమాదానికి గల కారణాలు తెలుస్తాయని స్థానిక పోలీసులు చెప్తున్నారు. కాగా, ఇదే ఇంటి నుంచి తుపాకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఇలాఉండగా ఇదే నెలలో అమెరికాలో మూడు సంఘటనలు జరిగాయి. ఉత్తర కరోలినాలో జరిగిన కాల్పుల్లో ఐదుగురు చనిపోయారు. ఓహియో ఘటనలో నలుగురు, ఇండియానాలో 10 మంది మృత్యువాతపడ్డారు. అలాగే, గత మూడు నెలల్లో మూడు పెద్ద సంఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. షికాగోలో జూలై 4 న జరిగిన కాల్పుల్లో 6, మేరీల్యాండ్‌లో జూన్ 10 న జరిగిన కాల్పుల్లో 3, టెక్సాస్‌లో మే 24 న జరిగిన తుపాకీ కాల్పుల్లో 19 మంది హతమయ్యారు. అలాగే జూలై 18 న ఇండియానా గ్రీన్‌వార్డ్ పార్క్ మాల్‌లో జరిగిన కాల్పుల్లో ముగ్గురు, జూలై 11 న దక్షిణ కాలిఫోర్నియాలో ఓ మహిళ సహా ముగ్గురు, జూలై 4 న షికాగోలో ఆరుగురు, జూన్ 1న ఓక్లాహోమాలో నలుగురు చనిపోయారు.

చక్కెర ఎగుమతులపై నిషేధం గడువు పొడగింపు

న్యూఢిల్లీ, అక్టోబర్ 29: చక్కెర ఎగుమతులపై విధించిన నిషేధాన్ని భారత ప్రభుత్వం పొడగించింది. ఈ నిషేధం వచ్చే ఏడాది అక్టోబర్ వరకు అమలులో ఉంటుంది. దేశీయ మార్కెట్‌లో ధర పెరుగుతున్న దృష్ట్యా చక్కెర ఎగుమతులను గత ఏడాది జూన్ 1 నుంచి ఈ ఏడాది అక్టోబర్ 31 వరకు కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. ఈ నిర్ణయం మన దేశంలో ద్రవ్యోల్బణాన్ని అరికట్టేందుకు ఉపయోగపడుతుందని కేంద్రప్రభుత్వం భావిస్తున్నది. గోధుమలపై విధించిన ఎగుమతి నిషేధం కూడా అమలులో ఉన్నది.

రికార్డు స్థాయిలో పంచదార ఎగుమతి నేపత్యంలో ధరల పెరుగుదల కనిపించింది. ప్రపంచంలో చక్కెర ఉత్పత్తిలో భారతదేశం అతిపెద్ద దేశం కాగా, బ్రెజిల్ తర్వాత రెండో అతిపెద్ద ఎగుమతిదారుగా నిలిచింది. బంగ్లాదేశ్, ఇండోనేషియా, మలేషియా, దుబాయ్ దేశాలు మన వద్ద ఉత్పత్తయ్యే చక్కెరను అత్యధికంగా కొనుగోలు చేస్తున్నాయి. గత ఏడాది దేశం పెద్ద మొత్తంలో చక్కెరను ఎగుమతి చేసింది. గతేడాది 60 లక్ష మెట్రిక్ టన్నుల (ఎల్ఎంటీ) వరకు ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా.. 70 ఎల్ఎంటీ ఎగుమతైంది. ఈ ఏడాది కూడా షుగర్ మిల్లుల నుంచి 82 ఎల్ఎంటీల చక్కెర ఎగుమతి జరిగింది. ఈ ఏడాది చక్కెర ఎగుమతి ఎన్నడూ లేనంతగా నమోదవడం విశేషం.

ఇండియన్ షుగర్ మిల్స్ అసోసియేషన్ ప్రకారం, ఈ సీజన్‌లో మన దేశంలో 35 మిలియన్ టన్నుల చక్కెర ఉత్పత్తి కాగా, 27 మిలియన్ టన్నులను వినియోగించింది. గత సీజన్‌లో దాదాపు 8.2 మిలియన్ టన్నుల నిల్వలతో కలిపి 16 మిలియన్ల మిగులు ఉన్నట్లు గణాంకాలు చెప్తున్నాయి. చక్కెర ఎగుమతులను మిగులుగా ఉన్న 16 మిలియన్లకు పరిమితం చేయాలనే ప్రభుత్వ ప్రణాళిక చాలా ముందు జాగ్రత్తగా కనిపిస్తున్నది.

అలాగే, గోధుమలపై విధించిన నిషేధం ఇంకా కొనసాగుతున్నది. పెరుగుతున్న గోధుమల ధరలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది మేలో వాటి ఎగుమతులపై భారత ప్రభుత్వం నిషేధం విధించింది. దేశీయంగా పెరుగుతున్న ధరలను నియంత్రించే చర్యల్లో భాగంగా గోధుమల ఎగుమతులపై భారత్ ఆంక్షలు పెట్టింది.

ఆల్ఫోర్స్ లో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

కరీంనగర్, అక్టోబర్ 29 (నేటినిజం ప్రతినిధి): కొత్తపల్లి లోని అల్ఫోర్స్ ఇ-టేక్నో స్కూల్లో శనివారం అవగాహన సదస్సు నిర్వహించ బడింది.

ఈ అవగాహన సదస్సు ఆల్ఫోర్స్ విద్యా సంస్థల ఛైర్మన్ డా.వి. నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో షీ టీం వారిద్వారానిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య వాఖ్యాతగా ఏఏస్సై శ్రీమతి విజయమణి విచ్చేశారు.

వారు మాట్లాడుతూ తెలంగాణలో షీటీం చరిత్ర మరియు నినాదాన్ని వివరించారు. ఈవ్ టీజింగ్ను అరికట్టేందుకు మొత్తము 20 బృందాలు అన్ని బహిరంగ ప్రదేశాల్లో రాత్రింబవళ్ళు చేస్తున్నాయన్నారు. హెడ్ కానిస్టేబుల్ పరుశారామ్ మాట్లాడుతూ విద్యార్థుల పట్ల వారి తల్లిదండ్రులు మరియు సమాజం పట్ల వారి వైఖరి గురించి అవగాహన కల్పించారు. విద్యార్థినిలు ఏలాంటి వ్యక్తిగత సమాచారాన్ని అయిన తల్లిదండ్రులతో పంచుకోవాలన్నారు. కానిస్టేబుల్ శ్రీలేఖ సైబర్ నేరాలపై విలువైన సమాచారాన్ని అందించారు. మహిళలపై మరియు ఆర్థిక నేరాలపై, సైబర్ నేరన్నలు చేస్తున్న అఘాయిత్యాలను ఆమె నొక్కి చెప్పారు. డబుల్ అథెంటికేషన్ ఫీచర్ మహిళ భద్రత చట్టాలు మరియు ఏమర్జెన్సి కాంటాక్ట్ సంబర్ల గురించి ఆమె సలహాలిచ్చారు. విద్యార్థినులు తమ ఫోటోలను మరియు ముఖ్యమైన సమాచారాన్ని షేర్ చేసుకోకూడదు అన్నారు. ఫేక్ ఐ.డి లు సృష్టించి ఫోటోలు, డేటాను దొంగిలించి ఫోర్న్ సైట్లలో పోస్టు చేస్తామని సైబర్ నేరాగాళ్ళు భాదితులను బ్లాక్మెయిల్ చేస్తూ భేదిరిస్తున్నారు అని అన్నారు. కొన్ని సమయాలలో పిల్లలను డ్రగ్స్ మరియు గంజాయి చెలామణికి ఉపయోగించుకుంటున్నారు. ఏదైనా సైబర్ క్రైమ్ సమస్య ఏదురైతే 1930 కి కాల్ చేయాలని ఆమె తెలియ జేసింది.

ఈ కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవంబర్‌లోగా శ్యామకుంట వెజ్, నాన్ వెజ్ మార్కెట్ పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి...

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 29: (నేటినిజం ప్రతినిధి): వచ్చే నవంబర్ లోగా వేములవాడ పట్టణం శ్యామ కుంట వెజ్, నాన్-వెజ్ మార్కెట్ ను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శనివారం వేములవాడ పట్టణంలో చేపడుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి తో కలిసి పరిశీలించారు. క్షేత్ర పర్యటనలో భాగంగా జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి భగవంత్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు.

ఇంకా మన ఊరు మనబడి కార్యక్రమం క్రింద చేపట్టాల్సిన మౌలిక సదుపాయాల కల్పన పనులను ప్రారంభం కాకపోవడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ప్రారంభించాలని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వేముల వాడ పట్టణంలోనీ ఎంపిక చేసిన 15 స్కూల్ లలో మన ఊరు మనబడి కార్యక్రమం క్రింద చేపట్టిన పనుల స్టేటస్ రిపోర్ట్ ను అందించాలని ఇంజనీరింగు అధికారులను ఆదేశించారు. అనంతరం జి + 1 విధానంలో నిర్మాణంలో ఉన్న శ్యామకుంట వెజ్, నాన్-వెజ్ మార్కెట్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. మార్కెట్ పనులు 80 శాతం మేర పూర్తి అయినందున మిగతా పనులను ఎలివేషన్ తో సహా నవంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. చెక్కపల్లి జంక్షన్ నుంచి కోరుట్ల జంక్షన్ వరకు 4 వరుసల రోడ్డుకు, వట్టెంల రోడ్డుకు టెండర్ లు పిలవాలని ఆర్ అండ్ బి ఇంజనీర్ లకు సూచించారు. తదనంతరం కలెక్టర్ వేములవాడ పట్టణంలోని మూలవాగును సందర్శించి, అభివృద్ధి, సుందరీకరణ పనులపై సంబంధిత అధికారులతో చర్చించారు. 64 లక్షల రూపాయలతో సుందరంగా తీర్చిదిద్దేందుకు బ్రిడ్జ్ మొదలు నుండి బస్టాండ్ వెనక వైపు 210 మీటర్లు, బ్రిడ్జ్ చివర నుండి వైకుంఠధామం వైపు 330 మీటర్ల బండ్ ను 4 మీటర్ల వెడల్పుతో బండ్ లను నిర్మిస్తామని అన్నారు. బండ్ పొడవునా వాకింగ్ ట్రాక్, గ్రాస్, బెంచ్ లు, చెట్లు, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. పనులన్నింటినీ డిసెంబర్ లోగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని నీటి పారుదల విభాగం ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మానేరు పై నిర్మిస్తున్న వంతెన పనులను సాధ్యమైనంత త్వరగా తిరిగి ప్రారంభించాలని అన్నారు. చివరగా సిరిసిల్ల పాత బైపాస్ రోడ్డు అభివృద్ధి , విస్తరణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సాధ్యమైనంత త్వరగా పనులను పూర్తి చేయాలనీ ఆర్ అండ్ బి ఇంజనీర్లకు సూచించారు. పర్యటన లో కలెక్టర్ వెంట ఆర్డీఓ లు పవన్ కుమార్, టి శ్రీనివాస్ రావు, ఆర్ అండ్ బి ఈ ఈ కిషన్, ఇరిగేషన్ ఈఈ అమరేందర్, మున్సిపల్ కమిషనర్ లు అన్వేష్, సమ్మయ్య, తహశీల్దార్ రాజా రెడ్డి , ప్రజారోగ్య విభాగం కార్య నిర్వాహక ఇంజనీరు సంపత్ రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీలంకపై న్యూజిలాండ్- గెలుపు.. 65 పరుగుల భారీ విజయం

న్యూఢిల్లీ, అక్టోబర్ 29: ఐసీసీ టీ20 వరల్డ్ కప్ లో భాగంగా ఇవ్వాల (శనివారం) జరిగిన మ్యాచ్‌లో శ్రీలంకపై న్యూజిలాండ్ జట్టు గెలిచింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కివీస్ జట్టు ఏడు వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసింది. అయితే మ్యాచ్ ప్రారంభంలోనే కీలక వికెట్లను టఫా టఫా పోగొట్టుకున్న కివీస్.. ఆ తర్వాత కోలుకుని మెరుగైన స్కోర్‌ని చేయగలిగింది.

అయితే.. సెకండ్ ఇన్సింగ్స్‌లో బ్యాటింగ్‌కి దిగిన శ్రీలంక జట్టు దూకుడుగా ఆడడానికి యత్నించి బోర్లాపడింది. లంక టాపార్డర్ కూడా త్వరగా పెవిలియన్ చేరడంతో ఆ జట్టు కష్టాల్లో పడింది. దీంతో నిర్ణీత ఓవర్లలో 168 పరుగుల టార్గెట్? చేరుకోలేక 19.2 ఓవర్లలోనే పది వికెట్లు కోల్పోయి కేవలం 102 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీంతో కివీస్ జట్టు లంకపై 65 పరుగుల తేడాతో విజయం సాధించింది.

కబడ్డీ, ఖో ఖో క్రీడలను జిల్లా యువజన, క్రీడలు ప్రారంభం

మెదక్, అక్టోబర్ 29: నేటినిజం ప్రతినిధి): FIT INDIA Campaign లో భాగంగా శనివారం మెదక్ పట్టణంలో మహిళలకు ప్రత్యేకంగా నిర్వహించిన కబడ్డీ, ఖో ఖో క్రీడలను జిల్లా యువజన, క్రీడల అధికారి నాగరాజ్ ప్రారంబించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు మహిళలకు ఈ క్రీడా పోటీలను నిర్వహించామని ఇందులో సుమారు వంద మంది మహిళలు పాల్గొన్నారని అన్నారు. శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండుటకు యువత, ఉద్యోగులు , మహిళలు ప్రతి రోజు శారీరక శ్రమతో పాటు కనీసం 30 నిమిషాలు రన్నింగ్ లేదా జాగింగ్ లో పాల్గొనే విధంగా ప్రోతహించడమే ఈ క్రీడల ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.

మెగా 5కె రన్ కు విశేష స్పందన

కరీంనగర్, అక్టోబర్ 29 (నేటినిజం ప్రతినిధి): ఫ్లాగ్ డే పోలీసు అమరవీరుల సంస్కరణ వారోత్సవాలుసందర్భాన్ని పురస్కరించుకుని కమిషనరేట్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం నాడు కరీంనగర్ లో జరిగిన మెగా 5కే రన్ కు విశేష స్పందన లభించింది. అన్ని స్థాయిలకు చెందిన పోలీసులు, వివిధ సంస్థలకు చెందిన ప్రతినిధులు, పోలీసు శిక్షణ సంస్థలకు చెందిన దాదాపు 5వేల మంది ఈ రన్ లో స్వచ్ఛందంగా పాల్గొన్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ ఈ 5కే రన్ ను జెండా ఊపి ప్రారంభించడంతో పాటు ప్రత్యక్షంగా పాల్గొన్నారు. మార్క్ ఫెడ్ గ్రౌండ్ నుండి ప్రారంభమై రాంనగర్ - మంకమ్మ తోట - గీత భవన్ చౌరస్తా ల మీదుగా పోలీస్ హెడ్ క్వార్టర్స్ కు చేరుకుంది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ మాట్లాడుతూ ఫ్లాగ్ డే సందర్భాన్ని పురస్కరించుకుని పోలీసు శాఖ నిర్వహిస్తున్న వివిధ రకాల కార్యక్రమాల్లో అన్ని వర్గాలకు చెందిన ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొంటూ పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తుండడం ఆహ్వానించదగిన పరిణామమన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాల్లో కరీంనగర్ రాష్ట్రంలో ముందంజలోకొనసాగుతున్నదని చెప్పారు. పోలీసు అమరవీరుల ఆశయాల సాధన కోసం అంకితభావంతో కృషి చేస్తున్నామని తెలిపారు. పోలీసు అమరవీరులు సమాజంలో శాంతి స్థాపన కోసం వారి ప్రాణాలను తృణప్రాయంగా అర్పించడం వల్లనే నేడు సమాజం శాంతియుతంగావర్ధిల్లుతున్నదని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (పరిపాలన) జి చంద్రమోహన్, ఏసిపి లు తుల శ్రీనివాసరావు, కరుణాకర్ రావు, సి ప్రతాప్, ఎస్బిఐ జి వెంకటేశ్వర్లు, ఇన్స్పెక్టర్లు సి హెచ్ నటేష్, లక్ష్మీ బాబు, దామోదర్ రెడ్డి, రవీందర్, తిరుమల్ గౌడ్, ఆర్ఐ లు కిరణ్ కుమార్, రమేష్, మల్లేశం, జానీ మియా లతో పాటుగా ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ, పోలీసు శిక్షణ సంస్థలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.